RNI: APTEL/25/A2169

# మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..

సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ : విశాఖపట్నం - పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర - సంపుటి : 1 - సంచిక : 257 - సోమవారం - 18 మే 2026 - ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు - పేజీలు : 8+16 - వెల రూ. 7/-

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కడప, హైదరాబాద్



## మోదీజీ మౌనమెందుకు

పరీక్ష రద్దయినా విద్యాశాఖ మంత్రిని ఎందుకు తొలగించడం లేదు?

నీట్ పేపర్ లీక్ కేసుపై మోదీకి రాహుల్ గాంధీ సూటి ప్రశ్నలు

4

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. పేపర్ లీక్ ఘటనపై ప్రధాని మోదీకి పలు సూటి ప్రశ్నలు సంధిస్తూ ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విట్టర్) లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. దేశంలో పదేపదే ఇలాంటి తప్పులు జరుగుతున్నా సంబంధిత కేంద్ర మంత్రి రాజీనామా చేయకపోవడం, ప్రధాని మోదీ మౌనం వహించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి

- భారతీయ కార్మికుడితో సహా నలుగురు మృతి
- మరో ముగ్గురు భారతీయులు గాయపడిన ఘటన
- భారత రాయబార కార్యాలయం స్పందన

వివరాలు 4వ పేజీలో





## ఐటీ, క్వాంటం రంగాల్లో ముందడుగు

అమరావతిలో దేశంలోనే తొలి 'క్వాంటం-సెక్యూర్ టెస్ట్ బెడ్'

ఎస్ఆర్ఎమ్ వేదికగా అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు

సైబర్ రక్షణ, డీప్-టెక్ ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా ఏపీ

'మేకిన్ ఇండియా' క్వాంటం సాంకేతికతలకు భారీ ఊతం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర హర్షం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి సరికొత్త డీప్-టెక్నాలజీ ఆవిష్కరణలకు వేదికగా మారుతోంది. దేశంలోనే మొట్టమొదటి 'క్వాంటం-సెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్' అమరావతిలో ఏర్పాటు కానుండటంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం 'ప్రపంచ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవం' సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను పంచుకున్నారు.

..వివరాలు 2లో

# ఆ ఆరు రోజులు నిప్పుల వర్షమే



- మే 19 నుంచి 24 వరకు అత్యంత తీవ్రంగా వడగాలులు
- 45 డిగ్రీలు దాటి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు అవకాశం
- తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక
- ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని సూచన
- వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు మరింత అప్రమత్తంగా ఉండాలని సలహా

2

తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగ్గుమననున్నాడు. రానున్న ఆరు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తీవ్రమైన ఎండలు, వడగాలులు ప్రభావం చూపనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా మే 19 నుంచి 24వ తేదీ వరకు అత్యంత తీవ్ర స్థాయిలో వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకుపైగా నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ వివరాల ప్రకారం, ఈ కాలంలో వడదెబ్బ ముప్పు ఎక్కువగా ఉండనుంది. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేకపోతే మధ్యాహ్న వేళల్లో బయటకు రావద్దని సూచించింది. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉండే అవకాశముందని వెల్లడించింది.





## విదేశీ ప్రయాణికులకు భారీ షాక్

- 95 శాతం టిక్కెట్లు రద్దు!

2

## ఆవుల జనన ధ్రువీకరణ పత్రాలపై కొత్త వివాదం

ఆవుల ధ్రువీకరణపై ఎమ్మెల్యే వ్యాఖ్యల దుమారం

బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై రాజకీయ రచ్చ

వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టిన టీఎంసీ

4




## సుప్రీం జడ్జిల సంఖ్య పెంపు

34 నుంచి 38కి పెరగనున్న సంఖ్య

సవరణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం

4




## వితంతువులకు శుభవార్త

- ఏపీలో జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు
- కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా కీలక ప్రకటన
- త్వరలోనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

2



## అన్నింటికీ నేనే మాట్లాడాలా?

- సీనియర్ల సైలెంట్ మోడ్‌పై జగన్ సీరియస్?
- ప్రజా సమస్యలపై నేతల్లో స్పందన కరువు
- నీట్, పెట్రోపై నేతల మౌనం
- సీనియర్ల తీరుపై కేడర్ గుర్రు
- తీరు మార్చుకోవాలంటూ అధినేత వార్నింగ్

3





## పథకాలకు నాయకుల పేర్లు!

కొందరికి ముద్దు.. కొందరేమో రద్దు..

ఎక్కడిదీ పద్దు.. ఉండదా హద్దు..

అసలిదంతా వద్దంటే వద్దు..!

కేంద్రంలో అయినా.. రాష్ట్రాల్లో అయినా.. ప్రభుత్వ పథకాలకు, కార్యాలయాలకు నాయకుల పేర్లు పెట్టే సంప్రదాయానికి ఇక స్వస్తి పలకాల్సిన అవసరం ఉంది.

3


## తిరుమలలో భారీ టోల్

- పెట్రోల్, డీజిల్ వాహనాలకు ఫైన్‌వేసే టీటీడీ కీలక యోచన
- ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించి, పర్యావరణాన్ని కాపాడటమే ప్రధాన లక్ష్యం
- అలిపిరి వద్ద రూ. 500 కోట్లతో అన్ని సౌకర్యాలతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం
- తిరుమలను 'సైలెన్స్ జోన్'గా మార్చి, శబ్ద కాలుష్యాన్ని 80 శాతం తగ్గించేందుకు ప్రణాళిక
- రూ. 100 కోట్లతో అన్నదానం వంటశాల ఆధునీకరణ, ఏఐ ఆధారిత నిర్వహణ

2



తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడుతూ, పర్యావరణ హితమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తిరుమల కొండపైకి వెళ్లే పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీగా టోల్ ఫీజు విధించాలని యోచిస్తోంది. అదే సమయంలో ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) పెద్దపీట వేయడంతో పాటు అలిపిరి వద్దే రూ. 500 కోట్లతో ఒక భారీ టౌన్‌షిప్‌ను నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.



## భలే మాట!




భార్య: మన అల్లుడేనండీ! గుర్తుపట్టలేదా? ఆంధ్రప్రదేశం నుంచి వస్తున్నాడు.. అక్కడ ఎండలు ఎక్కువ కదా!?



# ఆ ఆరు రోజులు నిప్పుల వర్షమే

**మే 19 నుంచి 24 వరకు అత్యంత తీవ్రంగా వడగాలులు**

**45 డిగ్రీలు దాటి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు అవకాశం**

**తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక**

**అమరావతి/హైదరాబాద్, మే 17(మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న వారం రోజుల పాటు ఎండలు దంచికొట్టనున్నాయి. మే 19 నుంచి 24వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భానుడి ప్రతాపం చుక్కలు చూపించనుందని, బలమైన వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజుల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుండటంతో, వడదెబ్బ తగిలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తాగునీటి బాటిల్‌ను వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, రోగులు ఈ కాలంలో ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండటం శ్రేయస్కరమని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

# వితంతువులకు శుభవార్త

**ఏపీలో జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు**



**శ్రీకాకుళం, మే 17(మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వితంతువులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. వస్తున్న జూన్ 12వ తేదీ నుంచి కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు అధికారికంగా ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన 'ప్రజాదర్బార్' కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. సామాజిక భద్రతా పింఛన్లకు అర్హులైన లబ్ధిదారులు త్వరలోనే ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రజాదర్బార్‌కు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించిన అనంతరం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే క్షేత్రస్థాయిలో అనేక రెవెన్యూ, భూ సమస్యలు పేరుకుపోయాయని మండిపడ్డారు. బాధితుల నుంచి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, ఆయా సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు, త్వరితగతిన పరిష్కరించడమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు. అర్హులైన ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందకుండా పోకూడదనే ఉద్దేశంతోనే ఈ నూతన పింఛన్ల ప్రక్రియను చేపడుతున్నట్లు వివరించారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో స్థానిక నియోజకవర్గ నేతలు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# ఐటీ, క్వాంటం రంగాల్లో ఏపీ ముందడుగు

- అమరావతిలో దేశంలోనే తొలి 'క్వాంటం-సెక్యూర్ టెస్ట్ బెడ్'
- ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ వేదికగా అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు
- సైబర్ రక్షణ, డీప్-టెక్ ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా ఏపీ రాజధాని
- 'మేకిన్ ఇండియా' క్వాంటం సాంకేతికతలకు లభించనున్న ఊతం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర హర్షం



**అమరావతి, మే 17 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి సరికొత్త డీప్-టెక్నాలజీ ఆవిష్కరణలకు వేదికగా మారుతోంది. దేశంలోనే మొట్టమొదటి 'క్వాంటం-సెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్' అమరావతిలో ఏర్పాటు కానుండటంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం 'ప్రపంచ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవం' సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను పంచుకున్నారు. భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన ప్రఖ్యాత 'సి-డాట్' సంస్థ, 'అమరావతి క్వాంటం వ్యాలీ' సంయుక్త భాగస్వామ్యంతో ఈ సరికొత్త ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. అమరావతిలోని ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ వేదికగా ఈ అధునాతన టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. నెక్స్ట్ జనరేషన్ సైబర్ డిఫెన్స్ (సైబర్ రక్షణ) పరిష్కారాలకు, సురక్షిత సమాచార వ్యవస్థలకు అమరావతి ఇకపై దేశంలోనే ప్రధాన కేంద్ర బిందువుగా మారుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

### ఐటీ, క్వాంటం రంగాల్లో ఏపీ ముందడుగు

దేశ భవిష్యత్తు భద్రతకు అత్యంత సురక్షితమైన సమాచార మార్పిడి, నమ్మకమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు ఎంతో కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత ఏప్రిల్ 14న రాష్ట్రంలో 'క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్' ప్రారంభమైనప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ ఈ సాంకేతిక రంగంలో కీలక అడుగులు వేస్తోందన్నారు. టెలికమ్యూనికేషన్, ఐటీ, క్వాంటం రీసెర్చ్ విభాగాల్లో అమరావతి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వేగంగా అభివృద్ధి చెందుతోందని స్పష్టం చేశారు.

### పరిశోధనలకు సరికొత్త వేదిక:

ఈ నూతన టెస్ట్ బెడ్ అందుబాటులోకి రావడం వల్ల క్వాంటం కమ్యూనికేషన్ హార్డ్‌వేర్, ఆప్టికల్ సిస్టమ్స్, అత్యాధునిక ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీల (డేటా భద్రతా సంకేతాలు) క్షేత్రస్థాయి పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఇది దేశీయంగా 'మేక్ ఇన్ ఇండియా' సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి ఊతమివ్వడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో అమరావతికి ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ భవిష్యత్తును మార్చే ఇలాంటి అధునాతన సాంకేతికతలను రూపొందించడంలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు, యువ స్టార్టప్‌లు భాగస్వాములు కావడానికి ఇది ఒక సువర్ణావకాశమని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును సాకారం చేసేందుకు కృషి చేస్తున్న సి-డాట్, అమరావతి క్వాంటం వ్యాలీ, ఎస్ఆర్ఎమ్ సంస్థల ప్రతినిధులతో పాటు ఇందులో భాగస్వాములైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, యువ ఆవిష్కర్తలకు సీఎం చంద్రబాబు నాయుడు తన ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

- ప్రధాని పిలుపుతో చంద్రబాబు నిర్ణయం
- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



**మచిలీపట్నం, మే 16 (మనసులో మాట):** పొదుపు చర్యలు పాటించాలంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నెల్లూరులో జరగాల్సిన మహానాడు కార్యక్రమాన్ని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, తదితర ముఖ్య నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో క్లస్టర్స్ వారీగా స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహానాడు ఉద్దేశాలు, నిర్ణయాలను పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలియచేస్తామన్నారు. యుద్ధ ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా నెలకొన్న విపత్కర పరిస్థితుల నేపథ్యంలో పార్టీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. నిత్యావసర సరకులు అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి అభద్రతా భావానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు. దీన్ని కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించి నట్లు చెప్పారు. ఈ కమిటీకి రాష్ట్ర పౌరసఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వం వహిస్తున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి నిత్యావసర సరకులను అధిక ధరలకు విక్రయిస్తే సహించమన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకమైన మానిటరింగ్ జరుగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# తిరుమలలో భారీ టోల్ ఫీజు

- పెట్రోల్, డీజిల్ వాహనాలకు ఫైన్‌వేసే టీటీడీ కీలక యోచన
- ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించి, పర్యావరణాన్ని కాపాడటమే ప్రధాన లక్ష్యం
- అలిపిరి వద్ద రూ. 500 కోట్లతో అన్ని సౌకర్యాలతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం
- తిరుమలను 'సైలెన్స్ జోన్'గా మార్చి, శబ్ద కాలుష్యాన్ని 80 శాతం తగ్గించేందుకు ప్రణాళిక
- రూ. 100 కోట్లతో అన్నదానం వంటశాల ఆధునికీకరణ, ఏఐ ఆధారిత నిర్వహణ



**తిరుమల, మే 17:** తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడుతూ, పర్యావరణ హితమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తిరుమల కొండపైకి వెళ్లే పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీగా టోల్ ఫీజు విధించాలని యోచిస్తోంది. అదే సమయంలో ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) పెద్దపీట వేయడంతో పాటు, అలిపిరి వద్దే రూ. 500 కోట్లతో ఒక భారీ టౌన్‌షిప్‌ను నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు టీటీడీ ఈఓ ఎం. రవిచంద్ర కీలక వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం రోజుకు సగటున 8,000 వాహనాలు తిరుమలకు వస్తుండటంతో పర్యావరణ, శబ్ద కాలుష్యం పెరుగుతోందని ఈఓ రవిచంద్ర తెలిపారు. దీన్ని నివారించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీ టోల్ విధించనున్నట్లు చెప్పారు. అయితే, ఈ నిర్ణయం వెంటనే అమలులోకి రాదని, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ ఫీజు నుంచి పూర్తిగా మినహాయింపు ఇచ్చి, కొండపై వాటి కోసం ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

### రూ. 500 కోట్లతో అలిపిరి వద్ద భారీ టౌన్‌షిప్

ఈ ప్రణాళికలో భాగంగా అలిపిరి వద్ద రూ. 500 కోట్ల వ్యయంతో భారీ టౌన్‌షిప్ నిర్మించనున్నారు. సుమారు 150 ఎకరాల్లో నిర్మించే ఈ టౌన్‌షిప్‌లో వసతి, పార్కింగ్, భోజన సౌకర్యాలు, పూజా సామగ్రి వంటి అన్ని సదుపాయాలు కల్పిస్తామని ఈఓ తెలిపారు. భక్తులు ఇక్కడే తమ మొక్కులు (తలనీలాలు వంటివి) తీర్చుకుని, ఆ తర్వాత దర్శనం కోసం మాత్రమే కొండపైకి వెళ్లేలా ఏర్పాట్లు చేయనున్నారు.

### 80 శాతం శబ్ద కాలుష్య నివారణే లక్ష్యం:

వీటితో పాటు, తిరుమలను కఠినంగా 'సైలెన్స్ జోన్'గా అమలు చేసి, హారన్లు, వాహనాల శబ్దాలను అరికట్టడం ద్వారా శబ్ద కాలుష్యాన్ని 80 శాతం వరకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే రూ. 100 కోట్లతో అన్నదానం వంటశాలను అత్యాధునికీకరించడం, ఏఐ (కృత్రిమ మేధ) ఆధారిత నిర్వహణను ప్రవేశపెట్టడం వంటి చర్యలు చేపట్టనున్నారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉంచే పాత పద్ధతికి బదులు, భక్తులను నేరుగా అన్నదానం హాల్స్‌కు పంపేలా సాంకేతికతను జోడించనున్నారు. ఈ సంస్కరణల ముఖ్య ఉద్దేశం భక్తులను ఇబ్బంది పెట్టడం కాదని, కలియుగ వైకుంఠంలో వారి దర్శనాన్ని మరింత ప్రశాంతంగా, అపార ఆధ్యాత్మిక అనుభూతిని పంచేలా మార్చడమేనని ఈఓ రవిచంద్ర వివరించారు.

# విదేశీ ప్రయాణికులకు భారీ షాక్

**విజయవాడ/హైదరాబాద్, మే 17:** విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు విమానయాన సంస్థలు భారీ షాక్ ఇచ్చాయి. విజయవాడ, విశాఖపట్నం, శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, చెన్నై ఎయిర్‌పోర్ట్ సహా తదితర విమానాశ్రయాల నుంచి విదేశాలకు వెళ్లే విమాన సర్వీసులు అకస్మాత్తుగా రద్దవుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణానికి నాలుగు నుంచి ఐదు రోజుల ముందే విమానాల రద్దు సమాచారం అందుతుండటంతో ముందస్తుగా ప్లాన్ చేసుకున్న కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఇప్పటికే బుక్ చేసుకున్న టికెట్లలో దాదాపు 95 శాతం వరకు క్యాన్సిలేషన్ మెసేజ్‌లు వస్తున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. టికెట్ డబ్బులు రిఫండ్ చేస్తున్నప్పటికీ, ముందుగానే వేసుకున్న ప్రయాణ ప్రణాళికలు పూర్తిగా అస్తవ్యస్తమవుతున్నాయి. ఇక కొత్తగా టికెట్లు బుక్ చేయాలంటే ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో రూ.70 వేల వరకు ఉన్న టికెట్ ధరలు ఇప్పుడు వన్‌వే ప్రయాణానికే రూ.2 లక్షల వరకు పెరిగినట్లు తెలుస్తోంది. మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగిన ధరలను చూసి చాలామంది కుటుంబాలు తమ విదేశీ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. ప్రత్యేకంగా విజయవాడ-షార్జా విమాన సర్వీసు రద్దవడంతో గల్ఫ్ కనెక్టింగ్ ఫ్లైట్స్‌పై తీవ్ర ప్రభావం పడింది. షార్జా మార్గంగా అమెరికా, యూరప్ వెళ్లాలని భావించిన వారి ప్రణాళికలు నిలిచిపోయాయి. హైదరాబాద్ నుంచి కూడా ఇదే తరహా పరిస్థితులు నెలకొనడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల కోసం వెతుకుతున్నారు. ఈ పరిస్థితికి పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలే ప్రధాన కారణమని విమానయాన వర్గాలు చెబుతున్నాయి. ఏవియేషన్ ఫ్యూయల్ ధరలు భారీగా పెరగడంతో పాత టికెట్ ధరలకే సర్వీసులు నడపడం సంస్థలకు భారంగా మారిందని సమాచారం. నష్టాలు తగ్గించుకునేందుకు ఎయిర్‌లైన్స్ కొన్ని సర్వీసులను రద్దు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, వేసవి సెలవులు, కుటుంబ కార్యక్రమాలు, విదేశాల్లో ఉన్న పిల్లల వద్దకు వెళ్లాలనుకున్నవారికి ఈ పరిణామాలు తీవ్ర నిరాశ కలిగిస్తున్నాయి. ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్నా కూడా భరోసా లేకపోవడంతో వందలాది కుటుంబాలు ఆందోళనలో ఉన్నాయి. విమానం ఎక్కకముందే ప్రయాణికులకు భారీ ఝలక్ తగిలిన పరిస్థితి కనిపిస్తోంది.



# అన్నింటికీ నేనే మాట్లాడాలా?

## వైసీపీ సీనియర్ల సైలెంట్ మోడ్‌పై జగన్ సీరియస్?

- ప్రజా సమస్యలపై నేతల్లో స్పందన కరువు
- నీట్, పెట్రోపై నేతల మౌనం
- సీనియర్ల తీరుపై కేడర్ గుర్రు
- తీరు మార్చుకోవాలంటూ అధినేత వార్నింగ్



**తాడేపల్లి, మే 17 (మనసులో మాట) :** ప్రతిపక్షంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న వేళ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుల చురుకుదనంపై అధిష్టానం అసంతృప్తి పెరుగుతున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రజా సమస్యలు, రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న అంశాలపై బలమైన స్వరం వినిపించాల్సిన కీలక నేతల్లో చాలామంది ఇంకా ఆశించిన స్థాయిలో స్పందించడం లేదన్న అభిప్రాయం పార్టీ అంతర్గతంగా బలపడుతోంది. ప్రతి చిన్నా పెద్దా అంశానికీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముందుకు రావాల్సి వస్తోందన్న భావన ఇప్పుడు సీనియర్ల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో హాజరు నమోదుకే పరిమితమై, స్వయంగా ప్రజా సమస్యలను పట్టుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో చాలామంది సీనియర్ నేతలు వెనుకబడుతున్నారన్న చర్చ విస్తృతంగా జరుగుతోంది. క్షేత్రస్థాయిలో పోరాటం కంటే కార్యక్రమాల్లో మొక్కుబడిగా పాల్గొని మౌనంగా ఉండటం రొటీన్‌గా మారిందన్న అభిప్రాయం కేడర్‌లోనూ వినిపిస్తోంది. తాజాగా నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం, పెట్రోల్-డీజిల్ ధరల పెరుగుదల వంటి అంశాలు లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్నప్పటికీ, పార్టీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా గట్టిగా వినిపించాల్సిన నిరసన స్వరం కనిపించలేదన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది. వేలాది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ అంశంలో దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేగుతున్నా, రాష్ట్ర నేతల నుంచి తగిన స్థాయి ఉద్యమం లేకపోవడం జగన్ దృష్టికి వెళ్లినట్టు తెలుస్తోంది. అదే విధంగా రాష్ట్రంలో పెట్రో ధరలపై ప్రజల్లో అసహనం పెరుగుతున్నా, దానిని రాజకీయంగా బలంగా ఎత్తిపట్టడంలోనూ చాలామంది నేతలు చురుకుదనం చూపలేదన్న చర్చ సాగుతోంది. ఇతర పార్టీలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపిన సందర్భాల్లో కూడా వైసీపీ నుంచి ఆశించిన స్థాయి ఒత్తిడి లేకపోవడం పార్టీ అంతర్గతంగా ప్రశ్నార్థకమవుతోంది. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో జరిగిన ఘటన వంటి సున్నిత అంశాల్లో కూడా స్థానిక నేతలు వెంటనే స్పందించకపోవడం అధిష్టానం సీరియస్‌గా తీసుకున్నట్టు చెబుతున్నారు. ప్రజలను నేరుగా ప్రభావితం చేసే అంశాలపై వెంటనే స్పందించాల్సిన సమయంలో ఆలస్యం చేయడం వల్ల రాజకీయ ప్రయోజనం తగ్గిపోతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి అంశానికీ తానే మాట్లాడాల్సి వస్తోందని జగన్ గతంలోనూ పరోక్షంగా పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. అయితే ఇప్పుడు అదే అంశంపై మరింత స్పష్టమైన హెచ్చరిక సీనియర్లకు వెళ్లినట్టు సమాచారం. కొందరు నేతలు మినహా ఎక్కువ మంది ఇంకా ప్రతిపక్ష రాజకీయాలకు తగిన గేర్‌లోకి రాలేదన్న అభిప్రాయం పెరుగుతోంది. పార్టీలో ప్రస్తుతం చురుకుగా స్పందించే నేతలు కొందరే ఉండగా, అధిష్టానం చెప్పాకే స్పందించే వర్గం మరోటి, పరిస్థితి చూసి తర్వాత మాట్లాడే వర్గం ఇంకోటి అన్న చర్చ జరుగుతోంది. దీంతో కేడర్‌లో అసంతృప్తి పెరుగుతూ, నాయకులు తీరు మార్చుకోవాలన్న డిమాండ్ బలపడుతోంది. మొత్తంగా వైసీపీలో సీనియర్ల స్పందన ఇప్పుడు పార్టీ భవిష్యత్ వ్యూహంలో కీలక అంశంగా మారింది. ప్రజా సమస్యలపై గళం విప్పకపోతే ముందుముందు అధిష్టానం మరింత కఠిన నిర్ణయాలకు వెళ్లొచ్చన్న సంకేతాలు పార్టీలో గట్టిగానే వినిపిస్తున్నాయి.

# నిమ్మాడలో ప్రజా దర్బార్ నిర్వహణ

### ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరణ



**శ్రీకాకుళం, మే 17 :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి వేగంగా పరిష్కారాలు అందించాలనే లక్ష్యంతో శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలు, వినతులను నేరుగా విన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వివిధ గ్రామాలు, మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కొరత, వ్యక్తిగత వినతులు వంటి అనేక అంశాలపై ప్రజలు తమ అర్జీలు సమర్పించారు. ఒక్కో సమస్యను ఓపికగా వింటూ వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులతో చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రజలతో నేరుగా మాట్లాడిన నేత, వారి ఇబ్బందులు, అవసరాలు, స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలు త్వరగా పరిష్కారం కావాలని అధికారులకు స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకూడదని, ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమస్యలను కేవలం నమోదు చేసి వదిలేయకుండా, పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పూర్తి చేయాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించేందుకు కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం మాత్రమే కాకుండా, వాటికి పరిష్కారాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పాలన కొనసాగుతుందని వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని వాటిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న సమస్యలను కూడా ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు తమ సమస్యలను నేరుగా తెలియజేసే అవకాశం లభించడంతో పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు చేరువయ్యే పాలనకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# పథకాలకు నాయకుల పేర్లు!



### కొందరికి ముద్దు.. కొందరేమో రద్దు..
### ఎక్కడిదీ పద్దు.. ఉండదా హద్దు..
### అసలిదంతా వద్దంటే వద్దు..!

**(మనసులో మాట, ప్రత్యేక ప్రతినిధి)**

కేంద్రంలో అయితేనేమి.. రాష్ట్రాల్లో అయితేనేమి.. ప్రభుత్వ పథకాలకు, కార్యాలయాలకు, చివరకు విశ్వవిద్యాలయాలకు కూడా వ్యక్తుల, రాజకీయ నాయకుల పేర్లు పెట్టే సంప్రదాయానికి ఇకనైనా స్వస్తి పలకాలి. అధికారం మారిన ప్రతిసారీ ఈ పేర్లు రాజకీయం అయిపోయి, తద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనం నిలువునా దుర్వినియోగం అవుతోంది. పాలకుల సొంత ప్రచార ఆర్భాటాల కోసం ప్రజల సొమ్మును తగలేసే ఈ పద్ధతికి ఇకనైనా ముగింపు పలికితే దేశానికి, రాష్ట్రానికి మంచిది.

### అధికార మార్పిడి.. పేర్ల రూపాంతరం!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంచుమించు 1983 నుంచి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల మధ్యనే ప్రధాన పోటీ నడుస్తోంది. 1983లో టీడీపీ, 1989లో కాంగ్రెస్, మళ్లీ 94, 99ల్లో టీడీపీ, 2004, 2009ల్లో కాంగ్రెస్, రాష్ట్ర విభజన తర్వాత 2014లో టీడీపీ, 2019లో వైఎస్సార్‌సీపీ, మొన్న 2024 మరియు తాజా ఎన్నికల పరంపరలో కూటమి ప్రభుత్వాలు.. ఇదీ వరుస! అయితే, ఇక్కడ అధికారం చేతులు మారిన ప్రతిసారీ పథకాల పేర్లు రూపాంతరం చెందుతూనే ఉన్నాయి. గతంలో 'ఇందిరమ్మ ఇళ్లు' కాస్తా 'ఎన్టీఆర్ గృహకల్ప' అయ్యాయి. వైఎస్సార్ హయాంలో 'ఆరోగ్యశ్రీ' వస్తే, ఆ తర్వాత 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ'గా, కూటమి ప్రభుత్వంలో 'ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ'గా పేర్లు మార్చారు. గత ప్రభుత్వ హయాంలో 'అన్న క్యాంటీన్లను' పూర్తిగా ఎత్తేస్తే.. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్లు ఖర్చు పెట్టి అదే పేరుతో పునరుద్ధరించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 'సచివాలయాలు'గా ఉన్నవాటిని, ప్రస్తుత ప్రభుత్వం 'విజన్ సెంటర్స్'గా మార్పు చేసింది. ఇలా పేర్లు మార్చిన ప్రతిసారీ బోర్డులు మార్చడానికి, రంగులు వేయడానికి అయ్యే ఖర్చు సామాన్యుడి పన్నుల రూపంలో వసూలు చేసినదే.

### బోర్డులు, సంచులు, వాహనాలు.. కోట్లలో వృథా!

ఈ మార్పు కేవలం పేర్లతో ఆగిపోదు. ఆయా పథకాలకు సంబంధించిన పోస్టర్లు, రేషన్ పంపిణీ సంచులు, లబ్ధిదారుల పత్రాలు, చివరకు రవాణా వాహనాల వరకు అన్నింటినీ కొత్తగా ముద్రించాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇంటింటికీ రేషన్ పంపిణీ కోసం ప్రత్యేక వాహనాలను కొనుగోలు చేస్తే.. ఆ తర్వాత ప్రభుత్వం మారగానే వాటిపై ఉన్న బొమ్మలను తొలగించి, కొన్నాళ్లకు ఆ పథకాన్నే పక్కన పెట్టడంతో ఆ వాహనాలన్నీ ఇప్పుడు నిరుపయోగంగా మారి తుప్పుపడుతున్నాయి. ఇదంతా ఎవరి సొమ్ము? రూపాయిల్లో కాదు.. వందల్లో, లక్షల్లో కాదు.. వేల కోట్లలో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరవుతోంది.

### ప్రజల్లో అయోమయం.. పాలకుల ఆర్భాటం!

'జగనన్న పథకం', 'చంద్రన్న పథకం' అంటూ పాలకులు తమ సొంత డబ్బా కొట్టుకుంటూ, ప్రజల సొమ్మును ప్రజలకే పంచుతూ తామేదో దానకర్ణుల్లా పోజులు కొట్టడం ముమ్మాటికీ తప్పే. ఈ పేర్ల మార్పిడి రాజకీయం ఆస్పత్రులు, యూనివర్శిటీలు, క్రీడా మైదానాలు, విమానాశ్రయాల వరకు పాకింది. దీనివల్ల ప్రజాధనం వృథా కావడమే కాకుండా, పథకాల ఉనికిపై జనాల్లో తీవ్ర అయోమయం, గందరగోళం నెలకొంటుంది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మంచి పథకాలను కేవలం రాజకీయ కక్షలతో రద్దు చేయడం ఒక రోకటిపోటు అయితే.. అదే పథకానికి రంగు, పేరు మార్చి తామే మొదటిసారి ప్రవేశపెడుతున్నట్టు ఊకదంపుడు ప్రచారాలు చేయడం పాలకులకు పరిపాటైపోయింది. ప్రభుత్వాలు మారినా మారేది ప్రజల రాతలే కానీ, పాలకుల పోకడలు కావని ఈ వ్యవహారాలు నిరూపిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించి, ప్రభుత్వ పథకాలకు 'ముఖ్యమంత్రి పథకం' లేదా 'ప్రభుత్వ పథకం' అని సాధారణ పేర్లు పెడితే ఈ వృథా ఖర్చు తప్పుతుంది. అంతకంటే ముందుగా.. ప్రజలు ఎప్పుడు మేలుకుని, పథకాల పేరిట పార్టీలు చేసుకుంటున్న ఈ ప్రచారాలను తిప్పికొట్టి, ఒక కొత్త రాజకీయ మార్పుకు నాంది పలుకుతారో వేచి చూడాలి!?



# చంద్రబాబు మాటలతో ప్రజలు మోసపోతున్నారు

### ప్రభుత్వంపై వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని విమర్శలు
### అప్పులు, నిరుద్యోగంపై తీవ్ర వ్యాఖ్యలు
### ఆర్టీసీ వ్యవహారంపైనా ఆరోపణలు

**అమరావతి, మే 17:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసపూరిత మాటలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. ఆదివారం కృష్ణా జిల్లాలో మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు, నిరుద్యోగం, నేరాల అంశాలపై ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. గత రెండు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 3.50 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని పేర్ని నాని పేర్కొన్నారు. అప్పులు, నేరాలు, నిరుద్యోగం వంటి అంశాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి పేరిట ప్రజలకు వాస్తవ పరిస్థితులను దాచిపెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం వెనుకబడిందని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కంటే ప్రచార కార్యక్రమాలపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆర్టీసీ అంశంపైనా పేర్ని నాని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులకు భరోసా కల్పించామని గుర్తుచేశారు. సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అప్పట్లో చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆర్టీసీలో ఉన్న 10 వేల బస్సులను పీఎంఈ బస్ పథకం కింద విద్యుత్ బస్సులుగా మార్చడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. మహిళల పేరుతో కొత్త విధానాలను తీసుకొస్తూ అసలు లక్ష్యాలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని పేర్ని నాని ఆరోపించారు. ప్రజల ఆస్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలో కూడా ఇలాంటి పరిస్థితులు వచ్చాయని పేర్కొంటూ ప్రభుత్వ విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# అట్రాసిటీ కేసులో పాస్‌పోర్ట్ అప్పగించిన రజిని

### హైకోర్టు షరతుల మేరకు పోలీసులకు సమర్పణ
### డీఎస్పీ కార్యాలయంలో పాస్‌పోర్ట్ అందజేసిన మాజీ మంత్రి
### వరుస కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైసీపీ నేత



**గుంటూరు, మే 17 :** మాజీ మంత్రి, వైసీపీ నేత విడదల రజిని తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో హైకోర్టు విధించిన షరతుల మేరకు పాస్‌పోర్ట్‌ను పోలీసులకు అప్పగించారు. ఆదివారం నరసరావుపేట డీఎస్పీ కార్యాలయానికి వెళ్లిన ఆమె, అధికారులకు పాస్‌పోర్ట్‌ను అందజేసి కోర్టు ఆదేశాలను పాటించారు. చిలకలూరిపేటకు చెందిన టీడీపీ నేత పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా యడ్లపాడు పోలీసులు విడదల రజిని, ఆమె అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టు నుంచి ఉపశమనం పొందేందుకు ఆమె హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన హైకోర్టు, షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్లు సమాచారం. అందులో భాగంగా విచారణ పూర్తయ్యే వరకు విదేశాలకు వెళ్లకూడదని, పాస్-పోర్ట్‌ను తక్షణం పోలీసులకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు విడదల రజిని తన న్యాయవాదులతో కలిసి నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావును కలిశారు. అనంతరం పాస్‌పోర్ట్‌ను అధికారికంగా సమర్పించి, సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని కూడా నమోదు చేసినట్లు తెలిసింది. మాజీ మంత్రి కార్యాలయానికి రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ కార్యాలయం వద్ద పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా వ్యవహరించారు. ఇదిలా ఉండగా 2024 ఎన్నికల అనంతరం విడదల రజిని వరుస కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని బెదిరించి కోట్ల రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఆమె కుటుంబ సభ్యులపై కూడా చర్యలు కొనసాగుతున్నాయి.

# 3 కోట్ల బీటీ రోడ్డుకు ప్రారంభం

**బాపట్ల, మే 17 :** అద్దంకి మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పార్వతీపురం - తిమ్మారెడ్డిపాలెం - కొటికలపూడి గ్రామాలను కలుపుతూ నిర్మించిన రూ. 3 కోట్ల విలువైన నూతన బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతం కానున్నాయి. ఈ సందర్భంగా కొటికలపూడి పంచాయతీ పరిధిలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లను కూడా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదు-పాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి బలమైన రహదారులు, మెరుగైన పారిశుధ్య సదుపాయాలు ఎంతో అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు.

మనసులోమాట

# రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి

## భారతీయ కార్మికుడితో సహా నలుగురు మృతి

### మరో ముగ్గురు భారతీయులు గాయపడిన ఘటన

### భారత రాయబార కార్యాలయం స్పందన



**మాస్కో, మే 17:** రష్యాపై ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు పాల్పడిన ఘటన అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ దాడుల్లో భారతీయ కార్మికుడితో సహా నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మరో ముగ్గురు భారతీయ కార్మికులతో పాటు పలువురు గాయపడినట్లు రష్యాలోని భారత రాయబార కార్యాలయం ధృవీకరించింది. దాడి జరిగిన ప్రాంతాన్ని భారత రాయబార కార్యాలయ అధికారులు సందర్శించినట్లు సమాచారం. గాయపడిన భారతీయ కార్మికులను ఆసుపత్రిలో పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయం అందించేందుకు స్థానిక అధికారులు, సంబంధిత సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు రాయబార కార్యాలయం తెలిపింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారిపట్ల భారత రాయబార కార్యాలయం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. గాయపడిన వారికి వైద్య సహాయం, ఇతర అవసరాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. భారతీయ కార్మికుల భద్రతపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా ఆదివారం తెల్లవారుజామున ఉక్రెయిన్ రష్యాపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులు చేపట్టినట్లు రష్యా అధికారులు తెలిపారు. మాస్కో రాజధానితో పాటు పలు సమీప ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు వెల్లడించారు. ఈ దాడులు దేశవ్యాప్తంగా భయాందోళనలు సృష్టించినట్లు సమాచారం. గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. రాజధాని మాస్కో వైపు దూసుకొచ్చిన సుమారు 81 డ్రోన్లను వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు. ఈ దాడుల కారణంగా పలు నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. మాస్కో ప్రాంతంతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో కూడా నష్టం సంభవించినట్లు సమాచారం. రష్యా--ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# మోదీజీ మౌనమెందుకు

## పరీక్ష రద్దయినా విద్యాశాఖ మంత్రిని ఎందుకు తొలగించడం లేదు?

## నీట్ పేపర్ లీక్ కేసుపై మోదీకి రాహుల్ గాంధీ సూటి ప్రశ్నలు

**న్యూఢిల్లీ, మే 17:** దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన 'నీట్ యూజీ 2026' ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ ఉదంతంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. పేపర్ లీక్ ఘటనపై ప్రధాని మోదీకి పలు సూటి ప్రశ్నలు సంధిస్తూ ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విట్టర్) లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. దేశంలో పదేపదే ఇలాంటి తప్పులు జరుగుతున్నా సంబంధిత కేంద్ర మంత్రి రాజీనామా చేయకపోవడం, ప్రధాని మోదీ మౌనం వహించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన 'ఎక్స్' పోస్ట్‌లో గత సంఘటనలను సైతం గుర్తుచేస్తూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. "గతంలో నీట్ 2024 పేపర్ లీక్ అయింది. అప్పట్లో పరీక్ష రద్దు కాలేదు, అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి కూడా రాజీనామా చేయలేదు. కేవలం సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఘటనపై నిజానిజాలు తేల్చేందుకు కేంద్రం ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఇప్పుడు నీట్ 2026లోనూ అదే విధంగా పేపర్ లీక్ అయింది. ఈసారి పరీక్ష రద్దు అయింది. అయినా సరే, సంబంధిత కేంద్ర మంత్రి మాత్రం ఇంకా రాజీనామా చేయలేదు. సీబీఐ మళ్లీ దర్యాప్తు చేస్తోంది.. దీనికోసం మరో కమిటీని ఏర్పాటు చేయనున్నారు" అంటూ విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ వ్యవహారంపై దేశం తరఫున ప్రధాని మోదీని ప్రశ్నిస్తున్నానంటూ రాహుల్ గాంధీ మూడు ముఖ్యమైన ప్రశ్నలను సంధించారు. దేశంలో ఇలాంటి ప్రతిష్టాత్మక పరీక్షల పేపర్ లీక్ ఘటనలు పదేపదే ఎందుకు జరుగుతున్నాయని ఆయన అడిగారు. భవిష్యత్తును కోల్పోతున్న విద్యార్థుల ఆందోళనల నడుమ, ఈ పరీక్షా పత్రాల లీక్‌పై ప్రధాని ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. పరీక్షల నిర్వహణలో, పేపర్ లీకులను అరికట్టడంలో పదేపదే విఫలమవుతున్న విద్యాశాఖ మంత్రిని ఎందుకు పదవి నుంచి తొలగించడం లేదని నిలదీశారు. లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని ఈ లీకేజీ వ్యవహారాలు దెబ్బతీస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం తూతూమంత్రంగా కమిటీలు వేయడం కాకుండా తక్షణమే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ చేసిన ఈ ట్వీట్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారడమే కాకుండా నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది.

# ఆవుల ధ్రువీకరణపై ఎమ్మెల్యే వ్యాఖ్యల దుమారం

## బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై రాజకీయ రచ్చ

## ఆవుల జనన ధ్రువీకరణ పత్రాలపై కొత్త వివాదం

## వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టిన టీఎంసీ

**కోల్‌కతా, మే 17:** పశువుల రవాణా అంశంపై పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆవుల జనన ధృవీకరణ పత్రాలు (బర్త్ సర్టిఫికెట్లు) చూపించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యే రేఖా పాత్ర చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీశాయి. ఈ వ్యాఖ్యలను అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తీవ్రంగా తప్పుబట్టింది. వివరాల్లోకి వెళ్తే.. హింగల్‌గంజ్ పరిధిలోని లెబుఖాలి ప్రాంతంలో పశువులను తరలిస్తున్న ఒక వాహనాన్ని ఎమ్మెల్యే రేఖా పాత్ర అడ్డుకున్నారు. వాహనంలోని పశువులను కిందకు దించి రోడ్డు పక్కన చెట్టుకు కట్టించి వాటికి గడ్డి, నీరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్రమ పశు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తమ పార్టీ నాయకత్వం ఆదేశించిందని రేఖా పాత్ర తెలిపారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అలాగే 14 ఏళ్లలోపు ఉన్న పశువులను వధించకూడదనే నిబంధనలు అమలులో ఉన్నాయని ఆమె వివరించారు. ఎవరైనా పశువులను రవాణా చేస్తే వాటికి సంబంధించిన వివరాలు అడుగుతామని, ఈ క్రమంలో ఆవుల జనన ధ్రువీకరణ పత్రాలు చూపించాలని కోరుతామని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఆవులకు జారీ చేసిన జనన ధృవీకరణ పత్రాలను చూపించగలరా అని టీఎంసీ నేతలు ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలతో ఇప్పుడు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. పశువుల రవాణా, అక్రమ వ్యాపారం, చట్టాల అమలు అంశాలపై రాజకీయ పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి.





# కండ్లా చేరిన ఎల్‌పీజీ ట్యాంకర్ సైమీ

## హర్మూజ్ జలసంధిని దాటి భారత్‌కు చేరిక

## ఇంధనంతో సురక్షిత ప్రయాణం

## ఉద్రిక్తతలతో సరఫరాపై ఆందోళనలు

**గుజరాత్, మే 17:** ఎల్‌పీజీ లోడ్‌తో ప్రయాణించిన 'సైమీ' ట్యాంకర్ సురక్షితంగా గుజరాత్‌లోని కండ్లా పోర్టుకు చేరుకుంది. మార్షల్ ఐలాండ్స్ జెండాతో ప్రయాణించిన ఈ నౌక దాదాపు 20 వేల టన్నుల ఇంధనాన్ని తీసుకొచ్చింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఈ ప్రయాణం ప్రాధాన్యం సంతరించుకుంది. మే 13న హర్మూజ్ జలసంధిని దాటిన ఈ నౌక 4 రోజుల ప్రయాణం అనంతరం భారత్‌కు చేరుకుంది. నౌకలో మొత్తం 21 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది ఉక్రెయిన్ పౌరులు కాగా, మరో 13 మంది ఫిలిప్పీన్స్‌కు చెందినవారు ఉన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటిన 11వ ఎల్‌పీజీ ట్యాంకర్‌గా 'సైమీ' నిలిచింది. దీంతో భారత్‌కు ఇంధన సరఫరాలో ఇది కీలక పరిణామంగా భావిస్తున్నారు. షిప్పింగ్, విదేశాంగ, రక్షణ, చమురు శాఖల మధ్య సమన్వయంతో ఈ ట్యాంకర్ సురక్షితంగా భారత తీరానికి చేరుకుంది. అంతర్జాతీయ స్థాయిలో ఇంధన సరఫరాపై పెరుగుతున్న ఒత్తిళ్ల మధ్య ఈ ప్రయాణం విజయవంతం కావడం కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది. హర్మూజ్ జలసంధిలో గత 75 రోజులుగా కొనసాగుతున్న అంతరాయాల ప్రభావం భారత్‌పై కూడా పడుతోంది. ఈ కారణంగా దేశ ముడిచమురు నిల్వలు గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. కొన్ని నెలల వ్యవధిలోనే చమురు నిల్వలు దాదాపు 15 శాతం మేర తగ్గినట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. అయితే దిగుమతులు తగ్గినప్పటికీ భారతీయ రిఫైనరీలు ప్రస్తుతం తమ కార్యకలాపాలను యథాతథంగా కొనసాగిస్తున్నాయి. ప్రాసెసింగ్‌లో ఇప్పటివరకు ఎలాంటి కోతలు లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ, సరఫరాలో అంతరాయాలు కొనసాగితే భవిష్యత్తులో నిర్వహణ భారంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.






# గంగ ఒప్పందంపై బంగ్లాదేశ్ షరతులు

## భారత్‌తో సంబంధాలపై కొత్త వ్యాఖ్యలు

## నీటి పంపకాలపై చర్చలకు డిమాండ్

## పద్మా ప్రాజెక్టుతో మరో వివాదం

**ఢాకా, మే 17:** గంగానది జలాల పంపకాల ఒప్పందం అంశం భారత్-బంగ్లాదేశ్ సంబంధాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో భారత్‌తో కొనసాగే సంబంధాలు గంగానది నీటి పంపకాలపై కుదిరే కొత్త ఒప్పందంపైనే ఆధారపడి ఉంటాయని బంగ్లాదేశ్ అధికార వర్గాలు తాజాగా వ్యాఖ్యానించాయి. దీంతో రెండు దేశాల మధ్య జలాల అంశం మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మేరకు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. తమ దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త నీటి ఒప్పందం అవసరమని పేర్కొంటూ, ఈ అంశంపై భారత్‌తో త్వరగా చర్చలు ప్రారంభించాలని కోరింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఒప్పందంలో మార్పులు అవసరమని పార్టీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఇండో--బంగ్లాదేశ్ గంగానది నీటి పంపకాల ఒప్పందం 1996లో కుదిరింది. అప్పటి ప్రధాని షేక్ హసీనా హయాంలో ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. అయితే ఈ ఏడాది డిసెంబర్‌తో దాని గడువు ముగియనుండటంతో కొత్త ఒప్పందంపై ఆసక్తి పెరుగుతోంది. బంగ్లాదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి మీర్జా ఫక్రుల్ ఇస్లాం ఆలంగీర్ మాట్లాడుతూ, కొత్త ఒప్పందం కుదిరే వరకు ప్రస్తుతం ఉన్న ఏర్పాట్లనే కొనసాగించాలని సూచించారు. అలాగే భవిష్యత్తులో కుదిరే జల ఒప్పందాలకు కాలపరిమితి ఉండకూడదని కూడా ఆయన స్పష్టం చేశారు. దీని వల్ల దీర్ఘకాలిక స్థిరత్వం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. గంగానదిని బంగ్లాదేశ్‌లో పద్మా నదిగా పిలుస్తారు. ఆ దేశ వ్యవసాయం, పర్యావరణ వ్యవస్థ, తాగునీటి అవసరాలకు ఈ నది ప్రధాన ఆధారంగా నిలుస్తోంది. అక్కడి జనాభాలో దాదాపు మూడో వంతు ప్రజలు జీవనోపాధి కోసం ఈ నదిపైనే ఆధారపడుతున్నారని అక్కడి వర్గాలు చెబుతున్నాయి. ఫరక్కా బ్యారేజ్ కారణంగా ఎండాకాలంలో నీటి ప్రవాహం తగ్గుతోందని బంగ్లాదేశ్ ఆరోపిస్తోంది. దీనివల్ల ఉప్పునీటి ప్రభావం పెరిగి పంటలు దెబ్బతింటున్నాయని చెబుతోంది. మరోవైపు కోల్‌కతా పోర్టు రక్షణ కోసమే ఫరక్కా బ్యారేజ్ నిర్మించామని భారత్ చెబుతోంది. ఇదే సమయంలో పద్మా నదిపై భారీ బ్యారేజ్ ప్రాజెక్టుకు బంగ్లాదేశ్ ఆమోదం తెలపడం ఇప్పుడు మరో కొత్త వివాదానికి కారణమవుతోంది.

# స్వీడన్‌లో మోడీకి ఘన స్వాగతం

**న్యూఢిల్లీ, మే17:** ప్రధాని నరేంద్రమోడీ తన ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం స్వీడన్ చేరుకున్నారు. నెదర్లాండ్స్ పర్యటన ముగిసిన అనంతరం ఆయన స్వీడన్‌కు వెళ్లారు. అక్కడ ప్రధాని మోడీకి స్వీడన్ ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. ప్రధాని విమానం స్వీడన్ గగనతలంలోకి ప్రవేశించగానే స్వీడిష్ గ్రిపెన్ ఫైటర్ జెట్లు ఎస్కార్ట్‌గా నిలిచాయి. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ మే 17, 18 తేదీల్లో గోథెన్‌బర్గ్‌లో పర్యటించనున్నారు. ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి స్వీడన్ ప్రధాని స్వయంగా ఎయిర్‌పోర్టుకు వెళ్లి మోడీకి స్వాగతం పలికారు. మరోవైపు ప్రధాని మోడీకి స్వాగతం పలికేందుకు ప్రవాస భారతీయులు భారీ సంఖ్యలో ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ పర్యటనలో స్వీడన్ వ్యాపారవేత్తలతో ప్రధాని సమావేశం కానున్నారు. అలాగే స్వీడన్ ప్రధాని క్రిస్టర్సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. రెండు దేశాల మధ్య పలు రంగాల్లో కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# సుప్రీం జడ్జీల సంఖ్య పెంపు

## 34 నుంచి 38కి పెరగనున్న సంఖ్య

## సవరణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ, మే 17:** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును మరింత బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను పెంచేందుకు రూపొందించిన సవరణ చట్టానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఉన్న జడ్జీల సంఖ్య 34 నుంచి 38కు పెరగనుంది. సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య సవరణ చట్టం-2026కు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ వెల్లడించారు. కేంద్ర క్యాబినెట్ ప్రతిపాదనను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. జడ్జీల సంఖ్య పెంపునకు సంబంధించిన ప్రతిపాదనకు ఈ నెల 5న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించింది. అనంతరం దీనిని రాష్ట్రపతికి పంపగా, ఆమె అధికారికంగా ఆమోదం తెలిపారు. దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం కీలకంగా మారింది. కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడంలో అదనపు జడ్జీల నియామకం సహాయపడుతుందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఈ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు న్యాయవాదులు, న్యాయమూర్తులు స్వాగతిస్తున్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ మాట్లాడుతూ, జడ్జీల సంఖ్య పెంపు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అంశమని తెలిపారు. అయితే సంఖ్య పెంపుతో పాటు మౌలిక వసతుల విస్తరణ కూడా అవసరమని సూచించారు. సుప్రీంకోర్టు కొత్త భవనం నిర్మాణం ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది జడ్జీలు పనిచేసేలా సదుపాయాలు కూడా ఏర్పాటు చేయవచ్చని అభిప్రాయపడ్డారు.

# నిద్ర రావడం లేదని రాత్రి పూట మెలటోనిన్ సప్లిమెంట్లను వాడుతున్నారా..? అయితే జాగ్రత్త..!




ఆధునిక జీవనశైలి కారణంగా నిద్ర సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఒత్తిడి, ఎక్కువసేపు మొబైల్, స్క్రీన్‌ల వినియోగం, రాత్రివేళల్లో కృత్రిమ వెలుతురు వంటి కారణాలతో చాలామంది నిద్రలేమితో బాధపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో త్వరగా నిద్ర పట్టేందుకు మెలటోనిన్ సప్లిమెంట్ల వినియోగం విపరీతంగా పెరిగింది. అయితే వీటిని ఎక్కువకాలం వాడటం ఆరోగ్యానికి హానికరమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మెలటోనిన్ అనేది మన శరీరంలో సహజంగా ఉత్పత్తి అయ్యే హార్మోన్. ఇది నిద్ర-మెలకువ చక్రాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మెలటోనిన్ సప్లిమెంట్లు ఈ సహజ హార్మోన్‌లా పనిచేసి శరీరానికి విశ్రాంతి సమయం వచ్చిందని సంకేతం ఇస్తాయి. దీంతో త్వరగా నిద్ర పట్టేందుకు, నిద్ర నాణ్యత మెరుగుపడేందుకు సహాయపడతాయి.

### సహజ నిద్ర చక్రం దెబ్బతినే ప్రమాదం..

అయితే నిద్ర సమస్యలు ఎక్కువ కావడంతో చాలామంది మెలటోనిన్‌ను అధికంగా లేదా నిరంతరం వినియోగించడం ప్రారంభిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలంగా వాడితే శరీరంలోని సహజ నిద్ర చక్రం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మెలటోనిన్‌ను ఎక్కువకాలం వాడటం వల్ల పగటి సమయంలో మత్తుగా ఉండటం, తలనొప్పి, తల తిరగడం, మెదడు మందగించినట్టుగా అనిపించడం వంటి సమస్యలు రావచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొంతమందిలో అలసట, ఏకాగ్రత లోపం కూడా కనిపిస్తాయి. అధిక మోతాదులో లేదా దీర్ఘకాలంగా మెలటోనిన్ వాడితే శరీరంలో సహజంగా మెలటోనిన్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఫలితంగా సప్లిమెంట్లు ఆపిన తరువాత సహజంగా నిద్రపోవడం మరింత కష్టమయ్యే ప్రమాదం ఉంటుంది. అలాగే నిద్ర సమయం పెరిగినా, నిద్ర నాణ్యత తగ్గిపోతుందని చెబుతున్నారు.

### తాత్కాలిక పరిష్కారం మాత్రమే..

మెలటోనిన్‌ను తాత్కాలిక పరిష్కారంగా మాత్రమే ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా 2 నుంచి 6 వారాల మధ్య మాత్రమే వాడటం మంచిదని పేర్కొంటున్నారు. నిద్ర సమస్యలు తగ్గిన తరువాత వీటిని ఆపేయాలని సూచిస్తున్నారు. మెలటోనిన్ తీసుకున్న తరువాత మత్తు ఎక్కువగా ఉండటం, అలసట, విచిత్రమైన కలలు రావడం లేదా ఎలాంటి ప్రయోజనం కనిపించకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వినియోగం నిలిపివేయాలని నిపుణులు చెబుతున్నారు. నిద్రలేమికి కారణమయ్యే ఒత్తిడి, ఆందోళన, చెడు నిద్ర అలవాట్లు వంటి మూల కారణాలను కూడా పరిష్కరించడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ఎక్కువకాలంగా మెలటోనిన్ వాడుతున్నవారు ఒక్కసారిగా ఆపకుండా మోతాదును క్రమంగా తగ్గించడం మంచిదని చెబుతున్నారు. మెలటోనిన్‌ను వాడేటప్పుడు తక్కువ మోతాదుతో ప్రారంభించి, నిద్రకు అరగంట నుంచి గంట ముందు తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. నిద్ర సమస్యలు కొనసాగితే స్వయంగా మందులు వాడకుండా వైద్యులను సంప్రదించడం అవసరమని హెచ్చరిస్తున్నారు.



# నాలుకపై కనిపించే రంగు, మచ్చలను బట్టి ఎలాంటి వ్యాధులు ఉన్నాయో ఇలా చెప్పవచ్చు

మన శరీరంలో ఏదైనా సమస్య ప్రారంభమైతే ముందుగా కొన్ని చిన్న సంకేతాల రూపంలో కనిపిస్తుంది. ఇలా సంకేతాలను చూపించే వాటిలో నాలుక కూడా ఒక ముఖ్యమైన సూచికగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. నాలుక రంగు, పైపొర, ఆకారం, మచ్చలు వంటి మార్పులు శరీర ఆరోగ్య పరిస్థితిపై సంకేతాలు ఇవ్వగలవని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా నిర్లక్ష్యం చేసే ఈ మార్పులు కొన్నిసార్లు పోషకాహార లోపాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు సూచన కావచ్చని చెబుతున్నారు. ఆరోగ్యకరమైన నాలుక సాధారణంగా లేత గులాబీ రంగులో ఉంటుంది. ఇది సరైన పోషకాహారం, తగినంత నీరు తీసుకోవడం, మంచి నోటి పరిశుభ్రతను సూచిస్తుంది. పలుచని తెల్లటి పొర ఉండటం సహజమని నిపుణులు చెబుతున్నారు.

### ఐరన్, విటమిన్ బి12 లోపం ఉంటే..

నాలుక చాలా పలుచగా లేదా తెల్లగా కనిపిస్తే అది ఐరన్ లోపం, విటమిన్ బి12 కొరత లేదా రక్తహీనతకు సంకేతం కావచ్చు. కొన్నిసార్లు దీర్ఘకాలిక అలసట లేదా శరీరంలో శక్తి లోపాన్ని కూడా ఇది సూచిస్తుందని చెబుతున్నారు. నాలుకపై మందమైన తెల్లని పొర కనిపిస్తే అది నోటి పరిశుభ్రత సరిగా లేకపోవడం, డీహైడ్రేషన్, ధూమపానం వంటి కారణాలతో అయ్యే అవకాశాలు ఉంటాయి. అలాగే ఫంగల్ ఇన్ఫెక్షన్, ఐరన్ లేదా విటమిన్ బి12 లోపం వంటి సమస్యలకు కూడా ఇది సంకేతం కావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. నాలుకపై పసుపు రంగు పొర కనిపించడం సాధారణంగా మృత కణాలు, బ్యాక్టీరియా లేదా ఆహార అవశేషాలు పేరుకుపోవడం వల్ల జరుగుతుంది. ఇది ఎక్కువగా తాత్కాలికమే అయినప్పటికీ, కొన్నిసార్లు జీర్ణ సమస్యలు లేదా జాండిస్ వంటి సమస్యలకు కూడా సూచనగా భావించాలి.

### నాలుక గాఢ ఎరుపు రంగులో ఉంటే..

అలాగే నాలుక గాఢ ఎరుపు లేదా స్ట్రాబెర్రీ రంగులో కనిపిస్తే అది విటమిన్ బి12 లోపం లేదా వాపుకు సంకేతం అవుతుంది. కొన్ని ఇన్ఫెక్షన్లు, ముఖ్యంగా స్కార్లెట్ ఫీవర్, కవాసాకి వ్యాధి వంటి సమస్యల్లో కూడా ఇలా కనిపించే అవకాశం ఉందని చెబుతున్నారు. కొంతమందిలో నాలుకపై మ్యాప్‌లా కనిపించే ఎర్రని మచ్చలు ఉంటాయి. దీనిని జియోగ్రాఫిక్ టంగ్ అని అంటారు. ఇది సాధారణంగా హానికరం కాదు, అంటువ్యాధి కూడా కాదు. అయితే ఒత్తిడి, విటమిన్ లోపాలు లేదా సోరియాసిస్ వంటి సమస్యలతో ఇది సంబంధం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. నిపుణుల సూచనల ప్రకారం, నాలుకలో అసాధారణ మార్పులు కొన్ని రోజులకు మించి కొనసాగితే వైద్యులను సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు. సరైన నోటి పరిశుభ్రత, సమతుల్య ఆహారం, తగినంత నీరు తీసుకోవడం ద్వారా నాలుక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# భోజనం చేసిన తరువాత నిద్ర మత్తుగా ఎందుకు అనిపిస్తుంది..



భోజనం చేసిన తర్వాత నిద్రగా అనిపించడం లేదా శరీరంలో అలసట రావడం చాలా మందికి సాధారణంగా కనిపించే సమస్య. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్నప్పటికీ కొందరికి భోజనం అనంతరం బద్ధకం, నిద్రమత్తు, శక్తి తగ్గిన భావన కలుగుతుంది. అయితే ఇది కేవలం ఆహారం వల్ల మాత్రమే కాకుండా, భోజనం తర్వాత శరీరంలో సహజంగా జరిగే మార్పుల కారణంగా కూడా జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. భోజనం చేసిన తర్వాత శరీరం రెస్ట్ అండ్ డైజెస్ట్ మోడ్‌లోకి వెళుంది. అంటే ఆహారం జీర్ణం కావడానికి జీర్ణాశయం, పేగుల వైపు రక్తప్రసరణ ఎక్కువగా జరుగుతుంది. ఈ ప్రక్రియ వల్ల శరీరం కొంత ప్రశాంతంగా, రిలాక్స్ అయినట్లుగా అనిపిస్తుంది. దాంతో కొందరికి నిద్ర మత్తు కూడా వస్తుంది. దీన్ని చాలాసార్లు సహజమైన ప్రతిస్పందనగా భావిస్తారు.

### ఇలా చేయవద్దు..

అయితే మనం తీసుకునే ఆహారం కూడా ఈ అలసటపై ప్రభావం చూపుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పెద్ద మొత్తంలో భోజనం చేయడం లేదా రిఫైన్డ్ కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం వల్ల ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. తెల్ల బియ్యం, వైట్ బ్రెడ్, అధిక చక్కెరలు ఉన్న పదార్థాలు, ఎక్కువగా ప్రాసెస్ చేసిన స్నాక్స్ వంటి ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచుతాయి. అనంతరం అవి వేగంగా తగ్గిపోవడంతో శరీరంలో అలసట, నిద్రమత్తు పెరిగే అవకాశం ఉంటుంది.

### వీటిని తీసుకోవాలి..

కనుక వీటికి భిన్నంగా ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన సమతుల ఆహారం తీసుకుంటే జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండి శక్తి కూడా ఎక్కువసేపు నిల్వ ఉంటుంది. ఆహారం తీసుకున్న వెంటనే శరీరంలో జరిగే ఈ మార్పులు సహజమైనవే అయినప్పటికీ, సరైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా భోజనం తర్వాత వచ్చే అలసటను కొంతవరకు తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# వాయు కాలుష్యంతో దీర్ఘకాలం పాటు మైగ్రేన్ తలనొప్పులు.. సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి..

వాయు కాలుష్యం కేవలం శ్వాసకోశ సమస్యలకే కాదు, తీవ్రమైన తలనొప్పులైన మైగ్రేన్‌లకు కూడా కారణమవుతుందనే విషయాన్ని తాజా అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా కాలుష్య స్థాయిలు పెరిగే రోజుల్లో మైగ్రేన్ ఎక్కువయ్యే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, తేమ వంటి అంశాలు కూడా ఈ ప్రభావాన్ని మరింత పెంచుతున్నాయని అధ్యయనం సూచిస్తోంది. ఈ పరిశోధనలో మైగ్రేన్ సమస్యతో బాధపడుతున్న 7 వేల మందికి పైగా వ్యక్తులను సుమారు 10 సంవత్సరాల పాటు పరిశీలించారు. వీరు నివసించే ప్రాంతాల్లో ట్రాఫిక్, పరిశ్రమలు, ధూళి తుఫాన్ల వల్ల ఏర్పడే వాయు కాలుష్య స్థాయిలు, అలాగే వాతావరణ పరిస్థితులను విశ్లేషించారు.



### కాలుష్యం స్థాయిలు అధికంగా ఉంటే..

పరిశోధనలో పాల్గొన్నవారు ఎప్పుడు ఆసుపత్రులు లేదా క్లినిక్‌లను మైగ్రేన్ చికిత్స కోసం సందర్శించారో నమోదు చేసి, ఆ రోజుల్లో ఉన్న కాలుష్య స్థాయిలతో పోల్చారు. కాలుష్య ప్రభావం శరీరంపై కొన్ని రోజుల తరువాత కూడా కనిపించవచ్చని భావించి, సంఘటనకు ముందు ఏడురోజుల డేటాను కూడా పరిశీలించారు. అధ్యయన కాలంలో ఆసుపత్రి సందర్శనలు అత్యధికంగా నమోదైన రోజుల్లో గాల్లో ఉన్న పీఎం10 స్థాయిలు సగటుతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉన్నాయని గుర్తించారు. సాధారణంగా 57.9 మైక్రాన్‌లు ప్రతి క్యూబిక్ మీటరుకు ఉండగా, అత్యధిక మైగ్రేన్ కేసులు నమోదైన రోజుల్లో ఇది 119.9 మైక్రాన్‌లకు చేరింది. అదేవిధంగా సూక్ష్మ కాలుష్య కణాలైన పీఎం 2.5 స్థాయిలు కూడా ఎక్కువగా నమోదయ్యాయి. ఈ కణాలకు దీర్ఘకాలంగా గురైన వ్యక్తులు మైగ్రేన్ మందులను ఎక్కువగా వినియోగించే అవకాశం 9 శాతం అధికంగా ఉన్నట్లు తేలింది. ట్రాఫిక్ కాలుష్యంతో విడుదలయ్యే నైట్రోజన్ డయాక్సైడ్ (ఎన్‌వో2) స్థాయిలు కూడా మైగ్రేన్ తీవ్రతతో సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఎన్‌వో2 స్థాయిలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నివసించే వారు మైగ్రేన్ మందుల వినియోగంలో 10 శాతం ఎక్కువ అవకాశాన్ని చూపించారు.

### కాలుష్యం తగ్గితే..

అత్యల్ప ఆసుపత్రి సందర్శనలు నమోదైన రోజుల్లో గాలి కాలుష్యం కూడా తక్కువగానే ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. ఇది వాయు కాలుష్యం, మైగ్రేన్‌ల మధ్య ఉన్న సంబంధాన్ని మరింత బలపరుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాతావరణ పరిస్థితులు కూడా కాలుష్య ప్రభావాన్ని పెంచుతున్నాయని అధ్యయనం తెలిపింది. అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ తేమ ఉన్న సమయంలో చీూ2 ప్రభావం ఎక్కువగా ఉండగా, చల్లని, అధిక తేమ ఉన్న పరిస్థితుల్లో పీఎం2.5 ప్రభావం తీవ్రమవుతుందని గుర్తించారు. వాతావరణ మార్పుల కారణంగా వేడి తరంగాలు, ధూళి తుఫాన్లు, కాలుష్య ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో మైగ్రేన్ బాధితులు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అధిక కాలుష్యం ఉన్న రోజుల్లో బయట తిరగడం తగ్గించడం, ఇంట్లో గాలి శుద్ధి పరికరాలు ఉపయోగించడం, మైగ్రేన్ లక్షణాలు కనిపించిన వెంటనే మందులు ప్రారంభించడం వంటి చర్యలు ఉపశమనానికి దోహదపడతాయని సూచిస్తున్నారు.

# మైరా 2.0తో ట్రావెల్ బుకింగ్‌లో కొత్త విప్లవం




**న్యూఢిల్లీ, మే 17:** మేక్‌మైట్రిప్ తన కృత్రిమ మేధస్సు ఆధారిత ట్రావెల్ అసిస్టెంట్ 'మైరా'ను మరింత అధునాతన ఫీచర్లతో 'మైరా 2.0'గా ఆవిష్కరించింది. ఇప్పటివరకు సాధారణ ట్రావెల్ గైడ్‌గా పనిచేసిన ఈ ఏఐ అసిస్టెంట్.. ఇకపై ప్రయాణ ప్రణాళికల నుంచి టికెట్ బుకింగ్, చెల్లింపుల వరకు అన్ని పనులను ఒకే వేదికపై పూర్తి చేసే పూర్తి స్థాయి డిజిటల్ సహాయకుడిగా మారింది. కొత్త వెర్షన్‌లో వినియోగదారులు ఒకే చాట్ విండోలో లేదా పూర్తిగా వాయిస్ ఆధారిత విధానంలో టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, తమిళం, కన్నడతో పాటు మొత్తం 8 భాషల్లో వాయిస్ బుకింగ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. స్క్రీన్‌ను తాకకుండా కేవలం మాటల ద్వారానే విమానాలు, హోటళ్లు, ప్రయాణ సేవలను బుక్ చేసుకోవచ్చు. 'మైరా 2.0'లో పలు కీలక ఫీచర్లను జోడించారు. ప్రయాణ సమయంలో సందేహాలను వెంటనే అడిగి తెలుసుకునే 'మిడ్-జర్నీ ప్రశ్నలు', టైపింగ్ అవసరాన్ని తగ్గించే 'స్మార్ట్ ఆటో కంప్లీట్', సీట్ల ఎంపిక కోసం 'ట్యాప్ ఆధారిత ఎంపికలు', ఒకే ఇంటర్‌ఫేస్‌లో చెల్లింపుల సదుపాయం వంటి ఫీచర్లు వినియోగదారులకు మరింత సౌకర్యాన్ని కల్పించనున్నాయి. అంతేకాకుండా 'మల్టీమోడల్ ఇన్‌పుట్' సదుపాయం ద్వారా ప్రయాణికులు తమ పాస్‌పోర్ట్ లేదా గుర్తింపు కార్డుల ఫోటోలను అప్‌లోడ్ చేస్తే, ఓసీఆర్ సాంకేతికతతో అందులోని వివరాలను గుర్తించి ఫారమ్‌లను ఆటోమేటిక్‌గా నింపే సదుపాయం కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రస్తుతం ప్రతి త్రైమాసికంలో 30 లక్షలకుపైగా ఏఐ సంభాషణలు జరుగుతున్నాయి. వీటిలో 45 శాతానికి పైగా చిన్న పట్టణాలు, రెండో-మూడో శ్రేణి నగరాల నుంచే వస్తుండటం విశేషం. మెట్రో నగరాలతో పోలిస్తే చిన్న పట్టణాల ప్రజలు వాయిస్ కమాండ్స్ వినియోగంలో 50 శాతం ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా రాజేష్ మాగోవ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ విమానాలు, హోటల్ బుకింగ్స్ వంటి క్లిష్టమైన బహుళ దశల ప్రక్రియలను కూడా 'ఏజెంటిక్ ఏఐ' సహాయంతో మానవీయ కోణంలో అర్థం చేసుకుని పూర్తి చేసే సామర్థ్యం 'మైరా 2.0'కు ఉందన్నారు. సంప్రదాయ ఫిల్టర్ ఆధారిత బుకింగ్ విధానంతో పోలిస్తే ఈ ఏఐ అసిస్టెంట్ ద్వారా బుకింగ్స్ చేసుకునే వారి సంఖ్య 10 శాతం పెరిగిందని సంస్థ వెల్లడించింది. దీంతో ట్రావెల్ టెక్నాలజీ రంగంలో 'మైరా 2.0' ఒక కొత్త మైలురాయిగా నిలుస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఏఐతో వ్యాపారాల్లో విప్లవాత్మక మార్పులు: చంద్రశేఖరన్



**న్యూఢిల్లీ, మే 17:** టీసీఎస్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ కృత్రిమ మేధస్సు భవిష్యత్ వ్యాపార వ్యవస్థలకు కీలక ఆధారంగా మారుతోందని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సంస్థ వార్షిక షేరుదారుల సమావేశంలో పాల్గొన్న ఆయన.. ఏఐ ఇకపై కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా, సంస్థల నిర్వహణ విధానాలను పూర్తిగా మార్చేస్తోందని వ్యాఖ్యానించారు. టెక్నాలజీ రంగంలో వేగంగా జరుగుతున్న మార్పులకు అనుగుణంగా టీసీఎస్ తన సేవలను విస్తరిస్తోందని చెప్పారు. ప్రస్తుతం ఏఐ సేవల ద్వారా సంస్థకు ప్రతి ఏడాది 2.3 బిలియన్ డాలర్ల ఆదాయం వస్తోందని వెల్లడించారు. క్లౌడ్, డేటా, సైబర్ భద్రత విభాగాల నుంచి కలిపి 11.5 బిలియన్ డాలర్ల ఆదాయం లభిస్తున్నదని తెలిపారు. సంస్థలు పెట్టుబడులు పెట్టే విధానం, సరఫరా గొలుసుల నిర్వహణ, నష్ట నివారణ, వినియోగదారులకు సేవలు అందించే తీరు వంటి అంశాలపై ఏఐ తీవ్ర ప్రభావం చూపుతోందని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంస్థలు తమ వ్యాపార విధానాలను ఏఐ ఆధారంగా మలుచుకుంటున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్‌లో తొలి ప్రత్యేక ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు టీసీఎస్ సిద్ధమవుతోందని కూడా ఆయన వెల్లడించారు. 160 కిలోవాట్ల సామర్థ్యంతో నిర్మించనున్న ఈ కేంద్రం దేశంలోనే తొలి ప్రత్యేక ఏఐ డేటా సెంటర్‌గా నిలవనుంది. విద్యుత్, కంప్యూటింగ్ సామర్థ్యం, భౌగోళిక పరిస్థితుల పరంగా ప్రపంచవ్యాప్తంగా ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఏఐ మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారత్ వ్యూహాత్మక కేంద్రంగా ఎదుగుతోందని ఆయన తెలిపారు. ప్రస్తుతం టీసీఎస్‌లో 5.84 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని సంస్థ వెల్లడించింది. ఇక సంస్థ సీఈవో, ఎండీ కృతివాసన్ గత ఆర్థిక సంవత్సరంలో రూ.28 కోట్ల వార్షిక వేతనం అందుకున్నారని వార్షిక నివేదికలో పేర్కొన్నారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 6.3 శాతం ఎక్కువగా ఉందని సంస్థ తెలిపింది.

# పెట్రోల్, సీఎన్‌జీ ధరల మళ్లీ పెంపు




**న్యూఢిల్లీ, మే 17 :** పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు వరుసగా పెరుగుతున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి సీఎన్‌జీ ధరల పెంపుతో వాహనదారులకు అదనపు భారం పడింది. మే 15న దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు సుమారు రూ.3 మేర పెంచిన కేంద్ర ప్రభుత్వం.. 48 గంటలు గడవకముందే సీఎన్‌జీ ధరను కూడా పెంచింది. తాజాగా కిలో సీఎన్‌జీపై మరో రూపాయి పెంపు ప్రకటించింది. ఈ పెరిగిన ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. దీంతో కేవలం రెండు రోజుల వ్యవధిలో సీఎన్‌జీ ధర మొత్తం రూ.3 వరకు పెరిగినట్లైంది. ప్రస్తుతం ఢిల్లీలో కిలో సీఎన్‌జీ ధర రూ.80.09గా ఉండగా, హైదరాబాద్‌లో రూ.97కు చేరుకుంది. పెరుగుతున్న ఇంధన ధరలతో సామాన్య ప్రజలు, వాణిజ్య వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన హోర్ముజ్ జలసంధి ప్రభావితమవడంతో అంతర్జాతీయంగా ముడి చమురు, గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ చమురు, గ్యాస్ వ్యాపారంలో పెద్ద వాటా ఈ మార్గం ద్వారానే సాగుతుండటంతో సరఫరా సంక్షోభం ఏర్పడి ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఇంధన ధరల పెంపుపై కేంద్ర ప్రభుత్వం కూడా వివరణ ఇచ్చింది. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. పశ్చిమాసియా పరిస్థితుల కారణంగా ప్రపంచంలోని పలు దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 20 శాతం నుంచి 100 శాతం వరకు పెరిగాయని తెలిపారు. భారతదేశంలో మాత్రం పెట్రోల్‌పై 3.2 శాతం, డీజిల్‌పై 3.4 శాతం మాత్రమే ధరలు పెంచామని పేర్కొన్నారు. మిగిలిన భారాన్ని ప్రభుత్వం, చమురు సంస్థలే భరిస్తున్నాయని ఆయన వివరించారు

# మహీంద్రా విద్యుత్ కారుపై భారీ తగ్గింపు




**ముంబై, మే 17:** దేశీయ విద్యుత్ వాహనాల మార్కెట్‌లో పోటీ పెరుగుతున్న నేపథ్యంలో మహీంద్రా సంస్థ తన ప్రీమియం విద్యుత్ ఎస్‌యూవీ 'బీఈ 6'పై భారీ ఆఫర్లను ప్రకటించింది. మే 2026 నెలలో ఎంపిక చేసిన ఎంవై-2025 నమూనాలపై ఏకంగా రూ.2 లక్షల వరకు నగదు తగ్గింపును అందిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. పరిమిత నిల్వలకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుందని, మే 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపింది. కొన్ని విక్రయ కేంద్రాల్లో అదనంగా ఎక్స్ఛేంజ్ బోనస్, ఉపకరణాల ఆఫర్లు కూడా లభించే అవకాశం ఉందని సమాచారం. కొత్త ఎంవై-2026 నమూనాలపై మాత్రం తగ్గింపులు చాలా పరిమితంగా ఉండనున్నాయి. భవిష్యత్ తరహా రూపకల్పనతో రూపొందిన ఈ విద్యుత్ ఎస్‌యూవీ ప్రస్తుతం యువతను బాగా ఆకట్టుకుంటోంది. సీ ఆకారంలోని ఎల్‌ఈడీ దీపాలు, వంగిన పైకప్పు రూపకల్పన, దాచిన తలుపు హ్యాండిల్స్, ద్వంద్వ స్పాయిలర్లు, 19 అంగుళాల అలాయ్ చక్రాలు ఈ కారుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సంస్థ ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన ఇంగ్లో వేదికపై ఈ వాహనాన్ని రూపొందించారు. ఈ కారులో రెండు 12.3 అంగుళాల డిజిటల్ తెరలు, విశాలమైన గాజు పైకప్పు, గాలి ప్రసరణ సదుపాయం ఉన్న సీట్లు, ప్రత్యేక వెలుతురు వ్యవస్థ, 16 స్పీకర్ల ధ్వని వ్యవస్థ వంటి ప్రీమియం సౌకర్యాలు ఉన్నాయి. అలాగే ఆధునిక డ్రైవింగ్ సహాయక వ్యవస్థ, 360 డిగ్రీల కెమెరా, ఆటో పార్కింగ్ సదుపాయం, వైర్‌లెస్ ఛార్జింగ్, ఆన్‌లైన్ నవీకరణలు, అనుసంధానిత వాహన సాంకేతికత వంటి ఆధునిక ఫీచర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. భద్రత పరంగా 7 గాలి సంచులు, ఏబీఎస్‌తో కూడిన ఈబీడీ, స్థిరత్వ నియంత్రణ వ్యవస్థ, టైర్ ఒత్తిడి పర్యవేక్షణ వ్యవస్థ, చిన్నారుల సీట్ల కోసం ప్రత్యేక యాంకర్లు వంటి భద్రతా సదుపాయాలు కల్పించారు. ఈ ఎస్‌యూవీ రెండు బ్యాటరీ ఎంపికల్లో అందుబాటులో ఉంది. 59 కిలోవాట్ గంటల బ్యాటరీ నమూనా 557 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉండగా, 79 కిలోవాట్ గంటల బ్యాటరీ నమూనా 683 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని సంస్థ తెలిపింది. వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయంతో కేవలం 20 నిమిషాల్లోనే 20 శాతం నుంచి 80 శాతం వరకు ఛార్జ్ చేసుకోవచ్చు. ఈ కారు ప్రారంభ ధర రూ.18.90 లక్షల నుంచి మొదలై, అగ్రశ్రేణి నమూనా ధర రూ.28.49 లక్షల వరకు ఉంది. ప్రస్తుతం ప్రకటించిన భారీ తగ్గింపుతో ఈ విద్యుత్ ఎస్‌యూవీ మరింత ఆకర్షణీయంగా మారిందని ఆటో రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## బంగారం, వెండి ధరలు
# మళ్లీ తగ్గుముఖం

**హైదరాబాద్, మే 17:** దేశంలో బంగారం, వెండి ధరలు వరుసగా తగ్గుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చిత పరిస్థితులు, రూపాయి మారకం విలువలో మార్పులు, అమెరికా రుణ పత్రాలపై పెరుగుతున్న రాబడుల ప్రభావంతో పసిడి ధరలు గత కొన్ని రోజులుగా దిగివస్తున్నాయి. రాబోయే రోజుల్లో కూడా ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఆదివారం ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,930గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,850 వద్ద కొనసాగుతోంది. నగరంలో కిలో వెండి ధర రూ.2.90 లక్షలకు చేరుకుంది. ఇక చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,910గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,500గా నమోదైంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,56,930గా, 22 క్యారెట్ల ధర రూ.1,43,850గా ఉంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,080 పలుకుతోంది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,44,000గా నమోదైంది. దేశంలోని ప్రధాన నగరాల్లో వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.80 లక్షల నుంచి రూ.2.90 లక్షల మధ్య కొనసాగుతోంది. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ పరిస్థితులు స్థిరపడితే బంగారం, వెండి ధరల్లో మరింత మార్పులు కనిపించే అవకాశం ఉంది. దీంతో పెట్టుబడిదారులు మార్కెట్ ధోరణులను గమనిస్తూ కొనుగోలు నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.




## ఆరేళ్ల తర్వాత లాభాల్లోకి
# వొడాఫోన్ ఐడియా

**న్యూఢిల్లీ, మే 17:** వొడాఫోన్ ఐడియా సంస్థ ఎట్టకేలకు ఆరేళ్ల తర్వాత లాభాలను నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరపు చివరి త్రైమాసికంలో సంస్థ రూ.51,970 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని సాధించింది. గత కొన్ని సంవత్సరాలుగా వరుస నష్టాలను ఎదుర్కొంటున్న కంపెనీకి ఇది పెద్ద ఊరటనిచ్చే పరిణామంగా భావిస్తున్నారు. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.7,167 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. అయితే తాజా త్రైమాసిక ఫలితాల్లో భారీ మార్పు కనిపించింది. కంపెనీ ఆదాయం కూడా స్వల్పంగా పెరిగింది. సమీక్ష కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం మూడు శాతం వృద్ధితో రూ.11,332 కోట్లకు చేరుకుంది. టెలికాం రంగంలో తీవ్రమైన పోటీ, భారీ అప్పులు, వినియోగదారుల కోత వంటి సమస్యల మధ్య వొడాఫోన్ ఐడియా ఈ లాభాలను నమోదు చేయడం పరిశ్రమ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సంస్థ చేపట్టిన ఆర్థిక పునర్వ్యవస్థీకరణ చర్యలు, సేవల విస్తరణ, వినియోగదారుల నిలుపుదల వ్యూహాలు ఫలితాలపై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏఐతో ఎంట్రీ-లెవల్ ఉద్యోగాలకు ముప్పు




కృత్రిమ మేధ (ఏఐ) ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. టెక్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తోంది. దీని రాకతో ఎంట్రీ-లెవల్ వైట్-కాలర్ ఉద్యోగాల (ఎంట్రీ లెవల్‌జాబ్స్)కు ముప్పు పొంచి ఉందని న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజి-ఆలీవర్ వైమన్ ఫోరమ్ సర్వే నివేదిక హెచ్చరించింది. దాదాపు 415మంది సీఈఓలను సర్వే చేసి, ఈ నివేదిక రూపొందించినట్లు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగంమంది సీఈఓలు ఇకపై ఎంట్రీ-లెవల్ ఉద్యోగాల కోసం నియామకాలు చేపట్టడానికి సుముఖంగా లేరని పేర్కొంది. దీంతో గతంలో సులభంగా దొరికిన ఉద్యోగాలు భవిష్యత్తులో లభించకపోవచ్చని.. ఐఐటీలలో, ఇతర టెక్ ఇన్‌స్టిట్యూట్‌లలో, క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో వచ్చే ఈజీ జాబ్స్ గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉందని తెలిపింది. ఏఐ ఇప్పటికే అనేక సాధారణ ఎంట్రీ-లెవల్ పనులను చూసుకోవడంలో సహాయపడుతున్నందున.. కంపెనీలు ఫ్రెషర్లను నియమించుకోవడం నుంచి వైదొలుగుతున్నాయి. దానికి బదులుగా అనుభవజ్ఞులైన ఉద్యోగులపై ఎక్కువ దృష్టి పెడుతున్నాయి. కోడ్ రాయడం, డాక్యుమెంట్‌లను విశ్లేషించడం, రిపోర్టులు రూపొందించడం, కస్టమర్ సపోర్ట్ వంటి వాటిల్లో ఏఐను ఉపయోగించడానికి కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఎన్ని పనులు చేసినప్పటికీ విచక్షణతో నిర్ణయాలు తీసుకోవడం, వాస్తవ సమస్యలను అర్థం చేసుకోవడంలో ఏఐ ఇబ్బంది పడుతోంది. దీంతో కృత్రిమ మేధను పర్యవేక్షించే బాధ్యతలను అనుభవజ్ఞులైన ఉద్యోగులకు అప్పగించడానికి ఎగ్జిక్యూటివ్‌లు ఆసక్తి చూపుతున్నట్లు సర్వే వెల్లడించింది. కేవలం ఏఐ సాధనాలతో ఆచరణాత్మక అనుభవాలు, ఆలోచనా పరిజ్ఞానాన్ని భర్తీ చేయడం సాధ్యం కాదని వారు భావిస్తున్నారు.

# సజీవంగా ఢిల్లీ ఆశలు!



## రాజస్థాన్ రాయల్స్ పై 5 వికెట్ల తేడాతో అద్భుత విజయం

## పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి పడిపోయిన రాజస్థాన్

**ఐపీఎల్ టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొట్టింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆదివారం జరిగిన ఉత్కంఠ పోరులో రాజస్థాన్ రాయల్స్ పై 5 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో ఢిల్లీ తన ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోగా.. ఓటమి పాలైన రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలను అత్యంత సంక్లిష్టం చేసుకుంది.**



**న్యూఢిల్లీ:** అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆదివారం 2026 మే 17 న జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఆ జట్టు 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసి ఘన విజయం సొంతం చేసుకుంది.

### పోరాడిన జురెల్, పరాగ్..

తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ బ్యాటర్లలో ధ్రువ్ జురెల్ 40 బంతుల్లో 53 పరుగులు, రియాన్ పరాగ్ 26 బంతుల్లో 51 పరుగులతో అర్ధ సెంచరీలు సాధించి జట్టుకు భారీ స్కోరు అందించారు. యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ సైతం దూకుడుగా ఆడి కేవలం 21 బంతుల్లోనే 46 పరుగులు చేసి సత్తా చాటాడు. ఢిల్లీ బౌలర్లలో స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ 4 ఓవర్లలో 40 పరుగులిచ్చి ఏకంగా 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డివిరిచాడు. లుంగి ఎంగిడి 4 ఓవర్లలో 24 పరుగులిచ్చి 2 వికెట్లు, మాధవ్ తివారీ 4 ఓవర్లలో 27 పరుగులిచ్చి 2 వికెట్లు తమ ఖాతాలో వేసుకుని రాజస్థాన్ స్కోరును కట్టడి చేశారు.

### రాహుల్, పోరెల్ జోరు..

194 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కు ఓపెనర్లు శుభారంభం అందించారు. కే ఎల్ రాహుల్ 42 బంతుల్లో 56 పరుగులు చేయగా, అభిషేక్ పోరెల్ 31 బంతుల్లో 51 పరుగులు చేసి విజయానికి బాటలు వేశారు. ఆఖర్లో అక్షర్ పటేల్ కేవలం 18 బంతుల్లో అజేయంగా 34 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. దీంతో మరో 4 బంతులు మిగిలి ఉండగానే ఢిల్లీ సునాయాసంగా గెలుపొందింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 4 ఓవర్లలో 35 పరుగులిచ్చి 2 వికెట్లు, బ్రిజేష్ శర్మ 4 ఓవర్లలో 44 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు. దసున్ షనక 3 ఓవర్లలో 29 పరుగులిచ్చి ఒక వికెట్ దక్కించుకున్నాడు.

### సంక్లిష్టంగా రాజస్థాన్ అవకాశాలు..

ఈ అద్భుత విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది. పాయింట్ల పట్టికలో 13 మ్యాచ్ లు ఆడిన ఢిల్లీ 6 విజయాలు, 7 ఓటములతో 12 పాయింట్లు సాధించి ఏడో స్థానానికి చేరుకుంది. మరోవైపు కీలక మ్యాచ్ లో ఓడిన రాజస్థాన్ రాయల్స్ పరిస్థితి కష్టంగా మారింది. ఇప్పటివరకు 12 మ్యాచ్ లు ఆడిన ఆ జట్టు 6 విజయాలు, 6 ఓటములతో 12 పాయింట్లు సాధించి ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఈ ఓటమితో రాజస్థాన్ ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. తదుపరి మ్యాచ్ లలో తప్పక గెలవాల్సిన పరిస్థితిలో రాజస్థాన్





# ప్లే ఆఫ్స్‌లో బెంగళూరు!



## పంజాబ్ పై 23 పరుగుల తేడాతో ఆర్సీబీ ఘన విజయం

## పాయింట్ల పట్టికలో అగ్రస్థానం.. సంక్లిష్టంగా పంజాబ్ ఆశలు



**ఐ పీ ఎల్ టోర్నీలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అదరగొట్టింది. ఆదివారం హెచ్ పీ సీ ఏ స్టేడియంలో జరిగిన ఉత్కంఠ పోరులో పంజాబ్ కింగ్స్ పై 23 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో ఆర్సీబీ అధికారికంగా ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించగా.. లక్ష్య ఛేదనలో చతికిలబడిన పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ ఆశలు మాత్రం అత్యంత సంక్లిష్టంగా మారాయి.**

ఆదివారం హెచ్‌పీసీఏ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు సాధించి ప్రత్యర్థి ముందు కొండంత లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో పంజాబ్ బ్యాటర్లు తడబడటంతో ఆ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 199 పరుగులకే పరిమితమై ఓటమి చవిచూసింది.

### అయ్యర్, కోహ్లి విజృంభణ..

తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు బ్యాటర్లలో ఓపెనర్ విరాట్ కోహ్లి 37 బంతుల్లో 58 పరుగులు చేసి జట్టుకు శుభారంభం అందించాడు. దేవదత్ పడిక్కల్ సైతం వేగంగా ఆడి 25 బంతుల్లో 45 పరుగులతో రాణించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వెంకటేష్ అయ్యర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. పంజాబ్ బౌలర్లను ఊచకోత కోస్తూ కేవలం 40 బంతుల్లోనే అజేయంగా 73 పరుగులు సాధించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడిన వెంకటేష్ అయ్యర్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. పంజాబ్ బౌలర్లలో హర్ ప్రీత్ బ్రార్ 4 ఓవర్లలో 35 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. యజువేంద్ర చాహల్ 3 ఓవర్లలో 42 పరుగులిచ్చి ఒక వికెట్, అర్షదీప్ సింగ్ 4 ఓవర్లలో 43 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టారు.

### పంజాబ్ తడబాటు..

223 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ కు ఆశించిన ఆరంభం లభించలేదు. బెంగళూరు బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పంజాబ్ బ్యాటర్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. మిడిలార్డర్ లో శశాంక్ సింగ్ కేవలం 27 బంతుల్లో 56 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. కూపర్ కొన్నోలీ 22 బంతుల్లో 37 పరుగులు, మార్కస్ స్టోయినిస్ 25 బంతుల్లో 37 పరుగులతో కాస్త ప్రతిఘటించినా భారీ లక్ష్యం కావడంతో ఫలితం దక్కలేదు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ 4 ఓవర్లలో 36 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. భువనేశ్వర్ కుమార్ 4 ఓవర్లలో 38 పరుగులిచ్చి 2 వికెట్లు తన ఖాతాలో వేసుకోగా.. రొమారియో షెపర్డ్ ఒక ఓవర్ వేసి 8 పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు.


### దర్జాగా క్వాలిఫై..

ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ఆర్సీబీ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఇప్పటివరకు ఆడిన 13 మ్యాచ్ లలో 9 విజయాలు, 4 ఓటములతో ఏకంగా 18 పాయింట్లు సాధించి దర్జాగా ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించింది. బెంగళూరు నెట్ రన్ రేట్ సైతం ప్లస్ 1.065 కు చేరుకుంది. మరోవైపు కీలక మ్యాచ్ లో ఓడిన పంజాబ్ కింగ్స్ పరిస్థితి దయనీయంగా మారింది. 13 మ్యాచ్ లు ఆడిన పంజాబ్ 6 విజయాలు, 6 ఓటములతో 13 పాయింట్లు సాధించి పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఈ ఓటమితో ఆ జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలు కష్టంగా మారాయి. తదుపరి మ్యాచ్ లలో ఇతర జట్ల ఫలితాలపై పంజాబ్ ప్లే ఆఫ్స్ భవితవ్యం ఆధారపడి ఉంటుంది.





KANCHARLA మనసులోమాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక



# పెద్ది'లో జగపతిబాబు లుక్ వైరల్

హైదరాబాద్, మే 17: పెద్ది సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్న వేళ చిత్ర బృందం మరో పవర్‌ఫుల్ అప్‌డేట్‌తో అభిమానులను ఉర్రూతలూగించింది. రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న జగపతిబాబుకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేశారు. 'అప్పలసూరి' పేరుతో విడుదలైన ఈ క్యారెక్టర్ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "భావోద్వేగాలతో నిండిన పాత్ర.. లక్ష్యంతో ముందుకు సాగే వ్యక్తి" అనే భావాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ వీడియోలో జగపతిబాబు చాలా రస్టిక్, పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. గ్రామీణ నేపథ్యంలో కనిపిస్తున్న ఆయన గెటప్, గంభీరమైన ఎక్స్‌ప్రెషన్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్‌లు, పాటలు ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించాయి. ముఖ్యంగా ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన 'చికిరి చికిరి', 'రాయ్ రాయ్ రా రా' పాటలు సోషల్ మీడియాలో మంచి స్పందన దక్కించుకున్నాయి. ఇప్పుడు 'అప్పలసూరి' గ్లింప్స్ రావడంతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. మే 18న ముంబైలో ఈ సినిమా ట్రైలర్‌ను భారీ స్థాయిలో విడుదల చేయడానికి చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తోంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ట్రైలర్‌పై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ భావోద్వేగాలు, యాక్షన్, ఎమోషనల్ డ్రామా మేళవింపుతో ఈ సినిమా రూపొందుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జూన్ 4, 2026న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై అంచనాలు మరింత పెరగనున్నాయని అభిమానులు భావిస్తున్నారు.



# 'జైలర్ 2'పై భారీ అంచనాలు

**చెన్నై, మే 17:** జైలర్ 2 సినిమాపై సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. రజినీకాంత్ హీరోగా నటిస్తున్న ఈ భారీ చిత్రాన్ని నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే మొదటి భాగం ఘన విజయం సాధించడంతో సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో రజినీకాంత్ పోషిస్తున్న 'ముత్తువేల్ పాండ్యన్' పాత్రను మరింత పవర్‌ఫుల్‌గా చూపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి భాగానికి ముందు జరిగిన సంఘటనలను చూపించే ప్రీక్వెల్ తరహా ఎపిసోడ్‌లతో పాటు.. తర్వాతి కథను కొనసాగించే పూర్తి స్థాయి సీక్వెల్ అంశాలను కూడా సినిమాలో మేళవించనున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ చిత్రంలో ప్రముఖ నటుడు, దర్శకుడు ఎస్ జే సూర్య విలన్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అలాగే అతిథి పాత్రల్లో మోహన్ లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్ కుమార్ కనిపించే అవకాశమున్నట్లు టాక్ వినిపిస్తోంది. మొదటి భాగంలో విలన్‌గా నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న వినాయకన్ ఈసారి ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ఇక సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి మరోసారి సంగీతం అందించనున్నారు. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మాస్ బీట్‌లపై అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజా ప్రచారం ప్రకారం సెప్టెంబర్ 4 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది. అధికారిక ప్రకటన ఇంకా వెలువడకపోయినా.. 'జైలర్ 2'కు సంబంధించిన వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# కాన్స్ వేదికపై మెరిసిన కల్యాణీ ప్రియదర్శన్



కల్యాణీ ప్రియదర్శన్ తాజాగా అంతర్జాతీయ సినీ వేడుక అయిన కాన్స్‌ఫిల్మ్‌ఫెస్టివల్‌వేదికపై తొలిసారి అడుగుపెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మలయాళం, తమిళం, తెలుగు చిత్రాల్లో తన సహజ నటనతో గుర్తింపు తెచ్చుకున్న ఈ హోమ్లీ బ్యూటీ, రెడ్ కార్పెట్‌పై తన రాయల్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. బ్లాక్ అండ్ పర్పుల్ కలర్ కలయికలో రూపొందించిన స్ట్రాప్‌లెస్ గౌన్‌లో ఆమె ఎంతో హుందాగా కనిపించారు. ఈ దుస్తులకు అనుగుణంగా ధరించిన విలాసవంతమైన నగలు ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ముఖ్యంగా ఆమె ధరించిన ప్రత్యేక నెక్లెస్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. ఈ నెక్లెస్‌ను కల్యాణ్ జ్యూవెల్లర్స్‌ప్రత్యేకంగా రూపొందించింది. 14 క్యారెట్ల వైట్ గోల్డ్‌తో తయారైన ఈ హారంలో భారీ నీలమణి రత్నంతో పాటు వందలాది వజ్రాలను అమర్చారు. అలాగే గులాబీ వర్ణపు అరుదైన రత్నాలు కూడా ఇందులో మెరిశాయి. దీనికి సరిపోయేలా రూపొందించిన చెవిపోగులు ఆమె రూపానికి మరింత గ్రాండ్ లుక్‌ను తీసుకొచ్చాయి. ఆమె మేకప్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హెవీ మేకప్‌కు దూరంగా ఉండి, సాఫ్ట్ గ్లామ్ స్టైల్‌ను ఎంచుకున్నారు. పింక్ షేడ్స్‌తో చేసిన మేకప్, ఓపెన్ కర్ల్స్ హెయిర్ స్టైల్‌తో ఆమె ఎంతో ఎలిగెంట్‌గా కనిపించారు. దక్షిణ భారత సినీ పరిశ్రమకు అంతర్జాతీయ వేదికపై ప్రాతినిధ్యం వహిస్తూ కల్యాణీ ప్రియదర్శన్ చేసిన ఈ అరంగేట్రం అభిమానులను గర్వపడేలా చేసింది.

# వెంకటేశ్ - త్రివిక్రమ్ సినిమాపై పెరుగుతున్న అంచనాలు

వెంకటేశ్, త్రివిక్రమ్‌కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. కుటుంబ కథా నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం పూర్తి స్థాయి కుటుంబ వినోద చిత్రంగా ఉండబోతుందనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో వెంకటేశ్ నటించిన ఓ పాత విజయవంతమైన చిత్రంలోని ప్రముఖ గీతాన్ని కొత్తగా వినిపించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఏ గీతాన్ని ఎంపిక చేశారనే విషయంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. త్రివిక్రమ్ సినిమాల్లో సంభాషణలు, సంగీతం, భావోద్వేగాలకు ప్రత్యేక స్థానం ఉంటుందనే విషయం తెలిసిందే. ముఖ్యంగా పాత క్లాసిక్ అంశాలను కొత్త తరానికి తగ్గట్టుగా చూపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. దీంతో వెంకటేశ్ పాత పాటను ఈ సినిమాలో ఎలా ఆవిష్కరిస్తారనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు వినోదం, హాస్యం, యాక్షన్ అంశాలతో కూడిన కమర్షియల్ చిత్రంగా తెరకెక్కనున్నట్లు సమాచారం. వెంకటేశ్ సహజ హాస్యానికి త్రివిక్రమ్ మాటలు జతకావడంతో మరో విజయవంతమైన కుటుంబ కథా చిత్రం సిద్ధమవుతోందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. సినిమా నిర్మాణానికి సంబంధించిన ప్రతి అంశాన్ని త్రివిక్రమ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా చిత్రాన్ని రూపొందించేందుకు నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని సమాచారం. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం చిత్రీకరణ పూర్తి చేసి వచ్చే వేసవిలో సినిమాను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.







# ఒక్క మగాడితోనే ఉండాలని నా కూతురికి చెప్పను

## కియారా వ్యాఖ్యలు వైరల్

కియారా అద్వాని చేసిన తాజా వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రేమ, పెళ్లి, సంబంధాల విషయంలో తన కూతురికి పూర్తి స్వేచ్ఛ ఇస్తానని ఆమె వెల్లడించారు. బాలీవుడ్ నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాను ప్రేమించి వివాహం చేసుకున్న కియారా.. ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్నానని చెప్పారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె.. ఈ తరం యువత సంబంధాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. "ఒక్క అబ్బాయితోనే డేటింగ్ చేసి అతడినే పెళ్లి చేసుకోవాలని నేను నా కూతురికి చెప్పను. జీవితాన్ని పూర్తిగా అనుభవించాలి. ఎవరైనా నచ్చితే ప్రేమించవచ్చు.. లేకపోతే వద్దనుకోవచ్చు. సంబంధాల్లో జరిగే అనుభవాలే జీవితానికి పాఠాలు నేర్పిస్తాయి" అని కియారా పేర్కొన్నారు. తప్పులు చేయడం సహజమని, వాటి నుంచే మనిషి ఎన్నో నేర్చుకుంటాడని ఆమె అభిప్రాయపడ్డారు. పిల్లలపై కఠిన నియమాలు మోపడం కంటే, వారికి నిర్ణయ స్వేచ్ఛ ఇవ్వడం ముఖ్యమని చెప్పారు. కియారా చేసిన ఈ వ్యాఖ్యలకు కొందరు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# 'ధురంధర్'పై సోషల్ మీడియాలో భారీ చర్చ

**ముంబై, మే 17:** ధురంధర్ సినిమాపై ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చ సాగుతోంది. రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం విడుదల అనంతరం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన దక్కించుకుందనే ప్రచారం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ముఖ్యంగా 'ధురంధర్ 2: ది రివెంజ్' థియేటర్లలో మంచి వసూళ్లు సాధించిందని, పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయి కలెక్షన్లు నమోదు చేసిందని అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. భారత్–పాకిస్థాన్ నేపథ్యంలో సాగే అంశాలు సినిమాలో ఉన్నప్పటికీ, అక్కడి ప్రేక్షకుల నుంచి కూడా మంచి ఆదరణ వస్తోందని నెటిజన్లు పేర్కొంటున్నారు. సినిమాను ఒకేసారి పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు వీక్షించడంతో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయని కూడా ప్రచారం సాగుతోంది. అయితే ఈ అంశాలపై సంబంధిత ఓటీటీ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు, స్థానిక చిత్రాలతో పోల్చినా ఈ సినిమాపై ప్రేక్షకుల ఆసక్తి ఎక్కువగా కనిపిస్తోందని సోషల్ మీడియాలో చర్చ కొనసాగుతోంది. మంచి కథ, యాక్షన్, నటీనటుల ప్రదర్శన ఉంటే భాష, దేశ సరిహద్దులు అడ్డుకావని పలువురు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం 'ధురంధర్' సినిమా కంటెంట్, యాక్షన్ సన్నివేశాలు, దర్శకత్వం, సంగీతంపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ కొనసాగుతోంది.



CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861